ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
గురువారం 17 అక్టోబరు 2024



నేడు మంత్రి లోకేశ్ రాక



విశాఖపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్ గురువారం రాత్రి నగరానికి రానున్నారు. రాజస్థాన్‌లోని ఉదయపూర్ నుంచి రాత్రి పది గంటలకు విశాఖపట్నం చేరుకుని పార్టీ కార్యాలయంలో బస చేస్తారు. 17వ తేదీ ఉదయం పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. మధ్యాహ్నం ఒంటి గంటకు జిల్లా కోర్టుకు వెళతారు. 'సాక్షి' పత్రికపై దాఖలు చేసిన పరువునష్టం కేసు వాయిదాకు హాజరవుతారు. అక్కడ నుంచి తిరిగి పార్టీ కార్యాలయానికి చేరుకుని రాత్రి బస చేస్తారు.

ప్రాణాలు తీస్తున్న బెట్టింగ్



ఈజీమనీ కోసం బానిసలుగా మారుతున్న యువత

ఉద్యోగులు, వ్యాపారులు కూడా...

- ఆన్‌లైన్‌లో అందుబాటులో అనేక యాప్‌లు
- పందెం కాసేందుకు లోన్‌యాప్‌లలో రుణాలు
- అవి తీర్చే దారిలేక అవస్థలు
- ఒత్తిళ్లు తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్న వైనం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పెందుర్తి సమీపంలోని సుజాతనగర్‌కు చెందిన 23 ఏళ్ల యువకుడు భారీగా డబ్బులు పోగొట్టుకున్నాడు. వాటి కోసం ఆన్‌లైన్ లోన్ యాప్‌ల ద్వారా రుణాలు తీసుకున్నాడు. ఆ రుణాలను తిరిగి చెల్లించాలంటూ యాప్ నిర్వాహకులు ఒత్తిడి పెంచడం, వేధించడంతో గోపాలపట్నం సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌లో టెక్నాలజీతో తనను మోసం చేసి బుకీలు రూ.ఎనిమిది లక్షలు దోచుకున్నారంటూ నగరానికి చెందిన ఒకరు ఆ మధ్య సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు చేపట్టి విదేశాల్లో ఉంటూ ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా బెట్టింగ్ నిర్వహిస్తున్న బుకీలకు ఏజెంట్లుగా పనిచేస్తున్న విశాఖ, అనకాపల్లి జిల్లాలకు చెందిన 11 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారిచ్చిన సమాచారం మేరకు బెట్టింగ్ ముఠాకు చెందిన 63 అకౌంట్లను పోలీసులు పరిశీలించి 36 ఖాతాల ద్వారా దాదాపు రూ.367 కోట్ల లావాదేవీలు జరిగినట్టు గుర్తించారు. 36 ఖాతాల్లో ఉన్న రూ.75 లక్షలను ఫ్రీజ్ చేశారు.

...నగరంలో ఆన్‌లైన్ బెట్టింగ్ సంస్కృతి చాప కింద నీరులా విస్తరిస్తోంది. కొంతకాలం కిందటి వరకూ గుట్టుగా సాగిన బెట్టింగ్...స్మార్ట్ ఫోన్‌లు, ఇంటర్‌నెట్ సౌలభ్యం అందుబాటులోకి వచ్చిన తరువాత విపరీతంగా విస్తరించింది. రాత్రికి రాత్రే కోటీశ్వరులు అయిపోవాలని కొందరు, ఈజీగా డబ్బులు వస్తాయనే ఆశతో మరికొందరు ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నారు. బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకుని అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

ఇలా జరుగుతుంది...

దేశవిదేశాల్లో ఉన్న బుకీలు ఆన్‌లైన్‌లో బెట్టింగ్ యాప్‌లను అందుబాటులో ఉంచుతున్నారు. బెట్టింగ్‌రాయుళ్లు గూగుల్ ప్లేస్టోర్ నుంచి వెల్‌కమ్, కాషిడో 777, మోస్ట్ బెట్, 1ఎక్స్ బెట్, పరిమ్యాచ్, మెల్‌బెట్, మెగాపరీ, బెట్‌వే, 22 బెట్...వంటి యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. యాప్‌ను ఓపెన్ చేసిన తర్వాత అందులో ఉన్న ఫోన్ నంబర్‌కు 'హాయ్' అని మెసేజ్ చేస్తే రెండు, మూడు బ్యాంక్ అకౌంట్లను పంపిస్తారు. ఆయా అకౌంట్లకు గూగుల్‌పే, ఫోన్ పే లేదా బ్యాంక్ ట్రాన్స్‌ఫర్ ద్వారా రూ.వెయ్యి చెల్లించాలి. ఆ మొత్తం బుకీలకు చేరగానే ఒక డెమో ఐడీ నంబర్‌ను పంపిస్తారు. యాప్‌ను ఓపెన్ చేసిన తర్వాత ఐడీ నంబర్‌ను ఎంటర్ చేయగానే బెట్టింగ్ కాసేవారి బ్యాంకు ఖాతా నంబర్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్, బ్రాంచి పేరు వంటి వివరాలను ఎంటర్ చేయాల్సి ఉంటుంది. ఆ ప్రక్రియ పూర్తికాగానే ఆరోజు క్రికెట్, ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, బాడ్మింటన్, లాన్ టెన్నిస్ వంటి ఆటలకు సంబంధించిన మ్యాచ్‌లు ఏమేమీ జరుగుతున్నాయనే దానితోపాటు బెట్టింగ్ కాయాలనుకుంటే ఆయా జట్లకు సంబంధించిన రేటింగ్ వివరాలు డిస్‌ప్లే అవుతాయి. బెట్టింగ్ కాయాలనుకునే వ్యక్తి తన ఖాతాలో నుంచి యాప్‌లో ఎంత బెట్ కాయాలనుకుంటున్నారో అంత మొత్తాన్ని యాడింగ్ చేసి, తాను బెట్టింగ్ కాయాలనుకునే మ్యాచ్‌ను ఎంచుకోవాలి. మ్యాచ్ విన్నర్‌తోపాటు టాప్ స్కోరర్, టాప్ వికెట్స్ టేకర్, బాల్ టు బాల్‌పై కూడా బెట్టింగ్ కాస్తుంటారు. అంతర్జాతీయ

... మిగతా 6వ పేజీలో

మద్యం లొల్లి

కొన్ని దుకాణాల్లో అధిక ధరకు విక్రయాలు



- అక్కయ్యపాలెంలో దుకాణ నిర్వాహకులపై తిరగబడిన మందుబాబులు
- దుకాణం మూసివేసిన నిర్వాహకులు
- గోపాలపట్నంలోనూ ఎమ్మార్పీ కంటే ఎక్కువకు అమ్మకం
- కొత్త స్టాకు వస్తే ధరలు తగ్గుతాయంటున్న విక్రయదారులు
- పాత బ్రాండ్లే... కొత్తవేవీ కనిపించలేదంటూ పెదవివిరుపు

అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్డులో మద్యం దుకాణం వద్ద మందుబాబుల ఆందోళన



దుకాణం మూసివేసిన దృశ్యం

విశాఖపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో బుధవారం నుంచి చేపట్టిన మద్యం విక్రయాల్లో అప్పుడే గొడవలు ప్రారంభమయ్యాయి. తాము అడిగిన బ్రాండ్లు లేవని చెబుతున్నారని కొందరు మద్యం ప్రియులు ఆవేదన వ్యక్తం చేయగా, కొన్ని దుకాణాల్లో ఎమ్మార్పీ కంటే అధిక ధరకు అమ్ముతున్నారని మరికొంతమంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్డులో ఉన్న మద్యం దుకాణంలో అధిక ధరలు వసూలు చేస్తుండడంతో ఆందోళనకు దిగారు. దీంతో నిర్వాహకులు దుకాణం మూసివేశారు. కాగా గోపాలపట్నం ప్రాంతంలోనూ ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు అమ్మకాలు సాగినట్టు తెలిసింది.

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన మద్యం పాలసీ మేరకు లాటరీల్లో దుకాణాలను దక్కించుకున్న యజమానులు బుధవారం నుంచి నగరంలో మద్యం విక్రయాలు ప్రారంభించారు. మొత్తం 155 దుకాణాలకు లాటరీ తీయగా, 31 దుకాణాలు మహిళలకు దక్కిన సంగతి తెలిసిందే. ఇదిలావుండగా మద్యాన్ని ఎమ్మార్పీ (గరిష్ఠ చిల్లర ధర)కే విక్రయించాలన్నది ప్రభుత్వ నిబంధన. కానీ, గత ప్రభుత్వం సొంతంగా ఏర్పాటుచేసిన దుకాణాల ద్వారా ఏ బ్రాండ్ల మద్యం విక్రయించారో ఇప్పుడు కూడా అవే రకాలు, అదే ధరలతో అందుబాటులో ఉంచారు. మందుబాబులు ఆశించినట్టుగా కొత్త బ్రాండ్లు కనిపించలేదు. పైగా కూటమి ప్రభుత్వం రూ.99కే క్వార్టర్ బాటిల్ అందిస్తామని ప్రకటించడంతో వాటి కోసం మందుబాబులు ఆరా తీశారు. వాటినే ఇవ్వాలని కోరగా ఆ ధరలతో మద్యం సరఫరా కాలేదని విక్రేతలు చెప్పడంతో చాలామంది నిరాశ చెందారు. అప్పటికి ఇప్పటికీ తేడా ఒక్కటేనని, అప్పుడు కేవలం నగదు ఇస్తేనే మద్యం ఇచ్చారని, ఇప్పుడు ఫోన్‌పే, గూగుల్ పే చేసినా ఇస్తున్నారని, అంతకు మించి ఎటువంటి వ్యత్యాసం లేదని పలువురు మందుబాబులు విమర్శించారు.

ఎమ్మార్పీ కంటే అధికంగా...

నగరంలో కొన్నిచోట్ల దుకాణదారులు ఎమ్మార్పీ కంటే ఒక్కో బాటిల్‌పై సుమారు రూ.20 ఎక్కువ వసూలు చేశారు. అక్కయ్యపాలెం 80 అడుగుల

... మిగతా 6వ పేజీలో

గ్రామీణ రహదారులకు మహర్దశ

జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాల్లో పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ వెల్లడి



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, పక్కన సీఈవో

- రూ.245 కోట్లు కేటాయించిన ప్రభుత్వం
- విశాఖ జిల్లాలో రూ.20 కోట్లతో 149 పనులు
- అనకాపల్లి జిల్లాలో రూ.83.51 కోట్లతో 943...
- పాడేరు డివిజన్‌లో రూ.142 కోట్లతో 176...
- డిసెంబరులోగా పూర్తికి ఆదేశాలు
- ఇతర రహదారుల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరిన జడ్పీ సీఈవో
- ప్రజా సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేయాలన్న చైర్‌పర్సన్
- కోరం లేక నాలుగో స్థాయీ సంఘ సమావేశం వాయిదా

విశాఖపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లాలో రూ.245 కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లోని 1,268 రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన బుధవారం జరిగిన 1,7 స్థాయీ సంఘ సమావేశాల్లో పలు ఇంజనీరింగ్ విభాగాల ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ రోడ్లపై చర్చకు ఎస్ఈ బదులిస్తూ విశాఖ జిల్లాలో రూ.20 కోట్లతో 149 పనులు, అనకాపల్లి జిల్లాలో రూ.83.51 కోట్లతో 943 పనులు మంజూరయ్యాయన్నారు. అల్లూరి జిల్లా పాడేరు డివిజన్‌లో రూ.142 కోట్లతో 176 పనులు ఇంతకుముందే మంజూరు చేశారన్నారు. ఈ పనులు డిసెంబరు నెలాఖరులోగా పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. గతంలో చిన్నపాటి మరమ్మతులకు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఆ పనులు రద్దు చేయడం జరిగిందన్నారు. జడ్పీ సీఈవో నారాయణ మూర్తి మాట్లాడుతూ

... మిగతా 6వ పేజీలో



నగరంలో వర్షం

విశాఖపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో నగరంలో బుధవారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకూ విడతలు విడతలుగా వర్షం పడింది. ఉదయం ఎనిమిది గంటల వరకూ వర్షం కురవడంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందిపడ్డారు. సాయంత్రం ఆరు, రాత్రి పది గంటల సమయంలో కూడా భారీవర్షం కురిసింది. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ తెలిపింది. మంగళవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి బుధవారం ఉదయం ఎనిమిది గంటల వరకు సీతమ్మధారలో 32, విశాఖపట్నం రూరల్‌లో 23.6, మహారాణిపేటలో 22.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. వాయుగుండం నేపథ్యంలో కృష్ణపట్నం, నిజాంపట్నం, ఓడరేవు, మచిలీపట్నంలలో మూడు, కాకినాడ, గంగవరం, విశాఖపట్నం రేవుల్లో ఒకటో నంబరు భద్రతా సూచిక ఎగురవేశారు. సముద్రం అల్లకల్లోలంగా ఉన్నందున మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని వాతావరణ శాఖ హెచ్చరించింది.

చైర్మన్ నియామకమెన్నడో?

రెండేళ్ల నుంచి ఖాళీగానే పెట్రోలియం వర్సిటీ గవర్నింగ్ బాడీ చైర్మన్ పోస్టు

- రెండుసార్లు నోటిఫికేషన్ ఇచ్చిన పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ మంత్రిత్వశాఖ
- అర్హులు లభించకపోవడంతో ముందుకుసాగని ప్రక్రియ
- యాక్టింగ్ (ఇన్‌చార్జి) చైర్మన్‌గా కొనసాగుతున్న డైరెక్టర్
- కీలక నిర్ణయాలు తీసుకునేందుకు ఇబ్బందులు



విశాఖపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పెట్రోలియం యూనివర్సిటీ (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ) బోర్డు ఆఫ్ గవర్నర్స్ (గవర్నింగ్ బాడీ) చైర్మన్ పోస్టు గడిచిన రెండేళ్లుగా ఖాళీగా ఉంది. వర్సిటీ ఏర్పాటైన తరువాత తొలి చైర్మన్‌గా ప్రొఫెసర్ డీఎస్ రమేష్ ఏడాదిపాటు (2018-2019) కొనసాగారు. ఆ తరువాత చైర్మన్‌గా మధ్యప్రదేశ్‌లోని ఒక విశ్వవిద్యాలయానికి వైస్ చాన్సలర్‌గా పనిచేసిన ప్రొఫెసర్ పరితోష్ కాన్సా బానిక్‌ను కేంద్ర పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ మంత్రిత్వ శాఖ ఎంపిక చేసింది. ఆయన మార్గదర్శకత్వంలో బోర్డు అనేక కీలక నిర్ణయాలను తీసుకుని వర్సిటీ అభివృద్ధికి కృషిచేసింది. ఆయన పదవీ కాలం 2022తో ముగిసింది. అప్పటి నుంచి కొత్త చైర్మన్ కోసం వెతుకులాట కొనసాగుతోంది. ఇప్పటివరకు కేంద్ర పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ మంత్రిత్వశాఖ రెండుసార్లు నోటిఫికేషన్ ఇచ్చింది. అయితే, అర్హులైన అభ్యర్థులు ఎవరూ రాకపోవడంతో చైర్మన్ ఎంపిక ప్రక్రియను పూర్తిచేయడం లేదు. గడిచిన రెండేళ్లుగా వర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ప్రొఫెసర్ శాలివాహన శ్రీవాస్తవ యాక్టింగ్ (ఇన్‌చార్జ్) చైర్మన్‌గా వ్యవహరిస్తూ వస్తున్నారు. సాధారణంగా వర్సిటీ అభివృద్ధికి సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకోవాలంటే తప్పనిసరిగా గవర్నింగ్ బాడీ ఆమోదం కావాల్సి ఉంటుంది. వర్సిటీకి సంబంధం లేని వ్యక్తులు చైర్మన్‌గా ఉంటే కఠినమైన నిర్ణయాలు తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. కానీ, ప్రస్తుతం డైరెక్టరే ఇన్‌చార్జి చైర్మన్‌గా ఉండడంతో నిర్ణయాలు

... మిగతా 6వ పేజీలో

విశాఖలో రతన్‌టాటా ఇన్నోవేషన్ సెంటర్

- నియోజవర్గానికో పారిశ్రామిక పార్కు
- మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం



విశాఖపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో టీసీఎస్‌తో పాటు రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ కూడా ఏర్పాటుకానుంది. విజయవాడలో బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల పరమ పదించిన రతన్ టాటా గుర్తుగా అమరావతిలో ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటుచేసి దానికి అనుబంధంగా ఐదు జోన్లలో ఇన్నోవేషన్ కేంద్రాలు పెడతామని సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించారు. అందులో విశాఖపట్నం కూడా ఉండడం గమనార్హం. విశాఖలో టాటా కన్సల్టెన్సీ సెంటర్ ఏర్పాటుకు కంపెనీ అంగీకరించిందని ఐటీ శాఖా మంత్రి లోకేశ్ వారం క్రితం ప్రకటించిన సంగతి తెలిసిందే. కాగా, ప్రతి నియోజకవర్గంలో పారిశ్రామిక పార్కు ఏర్పాటుచేయాలని నిర్ణయించినట్టు మంత్రి మండలి సమావేశంలో సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించారు. జిల్లాలో ఏడు నియోజకవర్గాలు ఉండగా నగర శివార్లలోని నియోజకవర్గాల్లోనే పారిశ్రామిక పార్కులు ఉన్నాయి. విశాఖ తూర్పు, పశ్చిమ, ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల్లో లేవు. స్థలాభావం వల్ల ఇప్పటివరకూ ఏర్పాటుకాలేదు. వీటికి కూడా శివార్లలోనే స్థలం కేటాయించి, అక్కడ పరిశ్రమలు ఏర్పాటుచేస్తే నగర యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

24న జడ్పీ సర్వసభ్య సమావేశం

విశాఖపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 24వ తేదీ ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజా ప్రతినిధులు, జడ్పీటీసీ సభ్యులు హాజరై ప్రస్తుతం నెలకొన్న సమస్యలపై చర్చిస్తారన్నారు.



వీఆర్ ల్యాబ్ ట్రైనీస్‌తో మాట్లాడుతున్న త్రిశాల్ జిత్ సేథీ

ఐటీఐను సందర్శించిన కేంద్ర నైపుణ్య పరిశ్రమల డైరెక్టర్ జనరల్

కంచరపాలెం, అక్టోబరు 16 : కేంద్ర నైపుణ్య-పరిశ్రమల డైరెక్టర్ జనరల్ (శిక్షణ) త్రిశాల్ జిత్ సేథీ బుధవారం కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐ కేంద్రాన్ని సందర్శించారు. ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు నగరానికి వచ్చిన ఆమె ప్రభుత్వ ఐటీఐకి వచ్చి పరిశీలించారు. ఐటీఐ కేంద్రంలోని అన్ని ల్యాబ్‌లను సందర్శించి, విద్యార్థులు శిక్షణ పొందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. శిక్షణార్థులు ఎప్పటికప్పుడు నైపుణ్యాలను మరింత వృద్ధిచేసుకునేందుకు దృష్టి సారించాలని సూచించారు. అపుడే ప్రస్తుతం ఉన్న జాబ్ మార్కెట్‌లో పోటీని ఎదుర్కొనే సామర్థ్యాలు పెంపొందుతాయన్నారు. అనంతరం వివిధ ట్రేడులు, ల్యాబ్‌లను పరిశీలించి అందుతున్న శిక్షణపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఆర్వీవీ రమణ, ఐఎంసీ చైర్మన్ ప్రభాకర్, వైస్ ప్రిన్సిపాల్ వై.ఉమాశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్స్ నిర్వహణపై నిర్లక్ష్యం

విశాఖ ఉత్తర నియోజకవర్గం పరిధిలోని ముఖ్య ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ (యూజీడీ) క్యాప్‌లు నిర్వహణ సరిగా లేకపోవడంతో అధ్వానంగా తయారయ్యాయి. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నగరంలో 2008లో ఆరంభమైన ఈ వ్యవస్థ ఇప్పటికీ గాడిన పడకపోవడం శోచనీయం.

- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు



ఎవరి ఇంటి ముందు ఉన్న మ్యాన్‌హోల్‌ను వారే మరమ్మతు చేసుకుంటున్న దృశ్యం

మురళీనగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఇంటి నుంచి సెప్టిక్ ట్యాంకుల మురుగునీరు నేల దిగువగా పైపులు అమర్చి, వాటిని రోడ్డు నడిమధ్యగా కట్టిన పెద్ద ట్యాంకులకు అనుసంధానించారు. తిరిగి ఈ ప్రవాహం నగరంలోని కొన్ని చోట్ల సేవేజ్ ప్లాంటుల్ని చేరే విధంగా అమలైన యూజీడీ వ్యవస్థ ఎప్పటికపుడు సమస్యగానే మారుతోంది.

గోతులమయంగా క్యాప్‌లు

రోడ్ల మధ్యగా కట్టిన మ్యాన్ హోల్ మూతలు తరుచూ మరమ్మతులకు గురవుతున్నాయి. వీటి చుట్టూ కడుతున్న సిమెంట్ అతుకుల నిర్మాణాలు వదిలిపోయి, ఐరన్ మ్యాన్ హోల్ క్యాప్‌లకు రోడ్డుకు మధ్య గోతుల్లా తయారై వాహనాలు కుదుపులకు గురవుతున్నాయి. దీంతో కొన్నిసార్లు ద్విచక్ర వాహనాలు పడిపోయి వాహనదారులు కింద పడిపోతున్నారు. ఈ సమస్య మురళీనగర్, మాధవధార ప్రాంతాలతో పాటు హైవే రోడ్ అండ్ బి జంక్షన్, బిర్లా జంక్షన్, పాలిటెక్నిక్ కాలేజీ రోడ్లలో తీవ్రంగా ఉంది.

కొత్తగా వేసిన రోడ్డుకు మ్యాన్ హోల్ క్యాపులు దిగువగా ఉండిపోవడం వల్ల హైవేలో యూజీడీ క్యాపులు అమర్చిన చోట గోతులుగా ఉండిపోయింది.

మరోవైపు కనెక్షన్ల తిప్పలు

మాధవధార 51వ వార్డు వుడా కాలనీలో ఇళ్ల నుంచి అమర్చిన మ్యాన్‌హోల్ క్యాప్‌లు చిందరవందరగా తయారయ్యాయి. ఇంటి నుంచి రోడ్డు మధ్య అమర్చిన క్యాపులు మూసుకుపోయాయి. దీంతో ఇళ్ల సెప్టిక్ ట్యాంకుల వద్ద సమస్య వస్తోంది. కొన్ని చోట్ల గుర్తించ లేనంతగా మ్యాన్‌హోల్ ఇంటి కనెక్షన్లు మరమ్మతులకు గురై మూసుకుపోయాయి. ఇలాంటి చోట మ్యాన్‌హోల్ కనెక్షను దుర్వాసనతో దుర్గంధం వెదజల్లుతోంది.

అలాగే, 49వ వార్డు బర్మాక్యాంప్ రోడ్డు పొడవునా ఈ సమస్య ఉంది. మాధవధార సీతన్న గార్డెన్స్ రోడ్డులో అయితే బస్టాపు టర్నింగ్ నుంచి దిగువ హైవే రోడ్డు సర్వీసు మార్గం వరకు ఈ మ్యాన్‌హోల్ గోతులు, వాటి కోసం తవ్విన రోడ్లు చిందరవందరగా తయారై ఇబ్బందిగా మారాయి.

పదేపదే అవే పనులు

వందల కోట్ల కాంట్రాక్టులు పూర్తి చేశామనిపించిన కాంట్రాక్టర్లు ఇపుడు కానరావడం లేదు. దెబ్బతిన్న ప్రతిసారి వార్డులో మరో కొత్త కాంట్రాక్టు ఇవ్వడం జరుగుతుంది. పైగా యూజీడీ నిర్వహణ మొత్తం జీవీఎంసీ వాటర్ సప్లయ్ విభాగానికి కేటాయించడంతో వారికి అదనపు భారంగా పరిణమిస్తోంది. వాటర్ సప్లయ్‌పనులతో పాటు ఎక్కడ యూజీడీ మ్యాన్ హోల్ క్యాప్‌లు పొంగిపొర్లినా క్లీన్ చేసే బాధ్యత వీరిదే. ఇలా నిర్వహణ గాడితప్పిన ఈ వ్యవస్థలో ఇక దెబ్బతిన్న మ్యాన్‌హోల్ క్యాపుల నిర్వహణ మళ్లీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు చూడాలి. దీనివల్ల రెండు విభాగాల మధ్య సమన్వయ లోపం కూడా కలుగుతోంది.

అంతర్ కళాశాలల కబడ్డీ టోర్నీ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రొఫెసర్ ఎన్.విజయ్‌మోహన్

విశాఖపట్నం (స్పోర్ట్సు), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఏయూ స్పోర్ట్సు బోర్డు నిర్వహిస్తున్న అంతర్ కళాశాల పురుషుల మహిళల కబడ్డీ చాంపియన్‌షిప్ టోర్నీబుధవారం ప్రారంభమైంది. ఏయూ ఇండోర్ స్పోర్ట్సు హాల్లో జరుగుతున్న ఈ పోటీలకు ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్సు సైన్సెస్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.విజయ్‌మోహన్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏయూ పరిధిలోని 18 కాలేజీల జట్లు పాల్గొనడం ఆహ్వానించదగ్గ విషయమని, రెండు రోజులపాటు జరిగే ఈ టోర్నీలో ప్రతిభ చూపిన క్రీడాకారులు ఆలిండియా అంతర్ వర్సిటీ కబడ్డీ టోర్నీలో పాల్గొనే ఆంధ్ర విశ్వవిద్యాలయం జట్టుకు ఎంపికవుతారని తెలిపారు. వర్సిటీ అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని విద్యారులు జాతీయఅంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్సు సైన్సెస్ విభాగాధిపతి డాక్టర్ ఏ.పల్లవి, ఐఐపీఈ స్పోర్ట్సు ఆఫీసర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కాలేజి పిజికల్ ఎడ్యుకేషన్ హెడ్ డాక్టర్ వై.పోలిరెడ్డి, బుల్లయ్య కాలేజి పిజికల్ ఎడ్యుకేషన్ హెడ్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, వివిధ కాలేజీల ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ టీఆర్ఎస్.లక్ష్మణరెడ్డి, గంగాభవాని, కబడ్డీ కోచ్ డాక్టర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘హాస్టళ్లలో సమస్యలు ఉంటే చెప్పండి’



విద్యార్థులతో మాట్లాడుతున్న వెంకటశేషమ్మ

కంచరపాలెం, అక్టోబరు 16 : స్థానిక ఊర్వశి జంక్షన్ సమీపంలో గల కప్పరాడ గిరిజన వసతి గృహాన్ని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి వెంకటశేషమ్మ సందర్శించారు. ఆమె విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. భోజనం, వసతి ఇతర మౌలిక వసతులపై ఆరా తీశారు. విద్యార్థులు సానుకూలంగా స్పందించడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. మాధవధార, పెందుర్తి హాస్టళ్లను కూడా సందర్శించినట్టు తెలిపారు.

ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ అధికారి అఖిల, హాస్టల్ వెల్ఫేర్ అధికారి ఆర్. సీతారాము పాల్గొన్నారు.

కిక్కిరిసిన రైతుబజార్

- ఉదయం నుంచి రాత్రి వరకూ జనం
- టమాటా కోసం ఎగబడిన కొనుగోలుదారులు



టమాటా కోసం క్యూ కట్టిన జనం

సీతమ్మధార, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బుధవారం ఒకవైపు వాన పడటం, మరోవైపు ఎండ కాయడంతో సీతమ్మధార రైతుబజార్‌లో రైతులు, కొనుగోలుదారులు ఇబ్బందులు పడ్డారు. కిలో రూ.50లకు విక్రయిస్తున్న టమాటాల కోసం జనం క్యూ కట్టారు. రైతుబజార్‌లో మూడు స్టాళ్లలో టమాటాలు అందుబాటులో ఉంచినా ప్రతి కౌంటర్ వద్ద రద్దీ నెలకొంది. బజార్‌లో ఉల్లిపాయలు అందుబాటులో లేకపోవడంతో కొనుగోలుదారులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

నగరంలోని అతి పెద్ద రైతు బజార్‌లో ఒక్కటైన ఎంవీపీ రైతుబజార్‌తో పాటు రైతుబజార్‌కు కూడా బుధవారం సెలవు కావడంతో సీతమ్మధార రైతు బజార్‌కు ఉదయం నుంచి పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో జనం కూరగాయలు కొనుగోలు చేయడానికి వచ్చారు.

దీంతో ఉదయం నుంచి రాత్రి వరకు బజార్ జనంతో కిక్కిరిసింది.

దసరా పండుగ తర్వాత రెండు రోజులు సెలవులు తీసుకొని నగరానికి వచ్చిన జనం అధిక సంఖ్యలో వచ్చి కూరగాయలు కొనుగోలు చేశారు. సీతమ్మధార రైతుబజార్ మంగళవారం సెలవు కావడంతో కూడా జనం పెద్ద ఎత్తున రావడానికి మరో కారణం.

తెలుగు సాహిత్యానికి విశ్వనాథ సేవలు అమోఘం

- డాక్టర్ అతుకూరు వెంకటేశ్వర్లు



సమావేశంలో ప్రసంగిస్తున్న వెంకటేశ్వర్లు

సీతంపేట, అక్టోబరు 16, (ఆంధ్రజ్యోతి) : తెలుగు సాహిత్యాన్ని జాతీయ భావాలతో సుసంపన్నం చేసిన మహాకవి విశ్వనాథ సత్యనారాయణ అని డాక్టర్ అతుకూరు వెంకటేశ్వర్లు (యోగి) పేర్కొన్నారు. బుధవారం సీతంపేట రాజేంద్రనగర్‌లో గల ప్రిజమ్ కళాశాలలో సహృదయ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ‘విశ్వనాథ నవలలు, యోగశాస్త్ర అంశాలు’ అంశంపై ప్రసంగ కార్యక్రమాన్ని నిర్వహించారు. సహృదయ సాహితీ సంస్థ అధ్యక్షులు శేఖరమంత్రి ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా విచ్చేసిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలుగు సాహిత్యానికి విశ్వనాథ సత్యనారాయణ సేవలు అనన్యమైనదన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కేజీ వేణు, డాక్టర్ డీవీ సూర్యారావు, ద్విభాష్యం రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నక్కవానిపాలెంలో భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు



పూజలు అందుకుంటున్న దుర్గామాత

సీతమ్మధార, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 24వ వార్డు నక్కవానిపాలెంలో క్రేజీ ఫ్రెండ్స్ సర్కిల్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మందిరం వద్ద మహిళా భక్తులంతా కలిసి అమ్మవారి దీపాలంకరణతో అమ్మవారి చిత్రపటాన్ని వేశారు.

ఈ కార్యక్రమంలో యూత్ ప్రతినిధులు ధర్మల గురుమూర్తి రెడ్డి, అశోక్ కుమార్, శ్రావన్ కుమార్ రెడ్డి, శ్రీనివాస రెడ్డి, ధీనిష్ రెడ్డి, నర్సింగ్‌రెడ్డి, వేణురెడ్డి, గౌతమ్, అంజి తదితరులు పాల్గొన్నారు.



దీపాలంకరణలో అమ్మవారు



వార్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, కూటమి నాయకులు

వార్డుల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు

ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

జగదాంబ కూడలి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ నియోజకవర్గంలోని వార్డుల్లో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన 36వ వార్డులో కూటమి నాయకులు, జోన్ 4 అధికారులతో కలసి పర్యటించారు.ఈసందర్భంగా రంగిరీజు వీధి ప్రజలు సామాజిక భవనం నిర్మించాలని, కొండవాలు ప్రాంతంలో యూజీడీ పైపులు మార్చాలని కోరారు. అలాగే సులభ్ కాంప్లెక్స్ తొలగించి, కమ్యూనిటీ హాలు నిర్మించాలని విన్నవించారు. గ్రంథాలయం అద్దె భవనంలో కొనసాగుతుందని, శాశ్వత భవనం నిర్మించాలని యువత చెప్పారు. కొండ ప్రాంతంలో పాత మెట్టు స్థానంలో కొత్త మెట్టు నిర్మించాలని మహిళలు కోరారు. గోడౌన్ గోతుల వద్ద సిసి కెమెరాల ఏర్పాటు, సత్యనారాయణ గుడి వద్ద వాటర్ ట్యాంకర్ చుట్టూ ప్రహరీ నిర్మించాలన్నారు. వీటిపై స్పందించిన ఎమ్మెల్యే సమస్యలపై అధికారులతో చర్చించి, దశల వారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు, టీడీపీ మహిళా నాయకురాలు కేదారి లక్ష్మి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రారంభం

మహారాణిపేట, అక్టోబరు 16 : కేజీహెచ్‌లో ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ అసోసియేషన్ ఎన్నికల ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభమైంది. అసోసియేషన్ కార్యాలయంలో పోలింగ్ అధికారిగా బి. శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో నామినేషన్ల స్వీకరణ చేపట్టారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారితో పాటు ఐదుగురు కార్యవర్గ సభ్యులకు పోటీ జరగనుండగా మొత్తం 19 నామినేషన్లు దాఖలు అయ్యాయి. 17న నామినేషన్ల పరిశీలన, 18న ఉపసంహరణ, 23న ఎన్నికల జరగనున్నాయి. ఎన్నికల్లో మొత్తం 520 మంది నర్సింగ్ సిబ్బంది ఓటుహక్కు వినియోగించుకోనున్నారు.

‘విశ్వకర్మ యోజన’ సద్వినియోగం చేసుకోండి

ఎంపీ ఎం. శ్రీభరత్



లబ్ధిదారునికి శిక్షణా పత్రం అందిస్తున్న ఎంపీ శ్రీభరత్

జగదాంబ కూడలి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) :కేంద్ర ప్రభుత్వం కులవృత్తుల వారి కోసం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పట్ల లబ్ధిదారులకు అవగాహన అవసరమని ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. బుధవారం ఆయన జోన్ 4 కార్యాలయంలో విశ్వకర్మయోజన పథకంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 19 కుల వృత్తులకు ఈ పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక చేయూతనిస్తున్నాయని చెప్పారు. అర్హులైన వారికి ఏడు రోజులు శిక్షణ అందిస్తారని ఆ సమయంలో రూ. 500 లతో పాటు రూ. 15 వేల విలువ చేసే టూల్ కిట్ ఇస్తారని చెప్పారు. అలాగే పథకం కింద 5 శాతం వడ్డీతో మొదట విడత రూ. లక్ష, రెండో విడత రూ.లక్షలు ఇస్తారని తెలిపారు. పథకాన్ని విజయవంతం చేయడానికి రాజకీయ నాయకులు సహకరించాలని కోరారు. జోనల్ అధికారులు ప్రతిఒక్కరికి పథకం పట్ల అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ, జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు, ఏపీడీ పుణ్యవతి పాల్గొన్నారు.

రూ.1.15 కోట్ల పల్లాడియం మెటల్ చోరీ

అనకాపల్లి రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సొంత ఇంటికే కన్నం పెట్టిన చందంగా... ఉద్యోగం చేస్తున్న కంపెనీలోనే విలువైన లోహాన్ని చోరీ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ దీపిక బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. పరవాడ ఫార్మాసిటీలోని రవీంద్ర హెరాయిస్ ప్రైవేట్ కంపెనీలో ఉత్ప్రేరకాన్ని రిసైకిలింగ్ చేసి పల్లాడియం మెటల్‌ను డ్రయ్యర్‌లో ఉంచి ఆర బెడతారు. ఇది అత్యంత ఖరీదైనది. ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన చింతకాయల రాజు పెయింటర్‌గా, మురళి ప్రొడక్షన్ బ్లాక్‌లో హెల్పర్‌గా, అక్కిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన కనుమూరి రామచంద్రరాజు అసిస్టెంట్ ప్రొడక్షన్ మేనేజర్‌గా, విజయనగరం జిల్లాకు చెందిన ముదునూరి వినీత్‌వర్మ ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పల్లాడియం లోహాన్ని చోరీ చేసి డబ్బులు సంపాదించాలని భావించారు. ఈనెల 5న చోరీకి పథక రచన చేశారు. వినీత్‌వర్మ, రామచంద్రరాజు అదే రోజు పరిశ్రమకు వెళ్లి సీసీ కెమెరాలను ఆపివేశారు. డ్రయ్యర్ లాక్‌కు సంబంధించి మారుతాళం చెవిని అప్పటికే తయారు చేయించి సిద్ధం చేసుకున్నారు. 9వ తేదీ రాత్రి రాజు, మురళి ప్లాంట్ గోడ దూకి లోపలికి వెళ్లారు. డ్రయ్యర్‌ను తెరిచి 4.11 కిలోల పల్లాడియం మెటల్‌ను చోరీ చేశారు. అనంతరం దాన్ని రాజు ఇంటి వద్ద భద్రపరిచారు. 10న ఉదయం డ్రయ్యర్‌ను పరిశీలించిన కంపెనీ ప్రతినిధి వరదరాజన్.. 4.11 కేజీల పల్లాడియం మెటల్ లేనట్టు గుర్తించారు. దీని విలువ రూ. 1.15 కోట్లు వుంటుందని అంచనా. లోహం చోరీకి గురైనట్టు నిర్ధారించుకుని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు రాజు, మురళి, రామచంద్రరాజు, వినీత్‌వర్మను అదుపులోకి తీసుకున్నారు.

ప్రాణాలు తీస్తున్న బెట్టింగ్

... 5వ పేజీ తరువాయి

స్థాయి మ్యాచ్‌లు ఏవీ జరగకపోతే క్లబ్ స్థాయిలో జరిగే మ్యాచ్‌లపైనా కూడా బెట్టింగ్ కడుతుంటారు. ఆన్‌లైన్‌లో బెట్టింగ్ వేస్తున్న వారిలో విద్యార్థులు, ఉద్యోగాలు, వ్యాపారులు ఎక్కువగా ఉంటున్నారు. సరదాగా మొదలెట్టి తర్వాత బెట్టింగ్‌కు బానిసలుగా మారిపోతున్నారు.

బుకీల మోసం

బెట్టింగ్‌లో ఓడిపోయినవారు మొత్తం డబ్బులు పోగొట్టుకుంటే బుకీలు మాత్రం కమీషన్ రూపంలో భారీగా ఆదాయం సమకూరుతోంది. బెట్టింగ్ ఎంతకాసినా సరే గెలిచిన వారి నుంచి పది శాతం కమీషన్‌గా మినహాయించుకుని మిగిలిన మొత్తాన్ని మాత్రమే గెలిచిన వారి ఖాతాకు బుకీలు జమ చేస్తారు. ఒక్కోసారి మ్యాచ్ జరుగుతున్నప్పుడు ఏదైనా జట్టు గెలుపు, ఓటమిలపై స్పష్టత వచ్చినప్పుడు బుకీలు తమకు బాగా డబ్బులు వస్తాయని భావిస్తే మ్యాచ్ అయిపోయేంత వరకూ యాప్‌ను హోల్డ్‌లో పెట్టేస్తుంటారు.బెట్టింగ్ కాసిన వారిలో ఎవరైనా ఎదుటి జట్టు వైపు బెట్టింగ్ మార్చేసుకుంటే తమకు రావాల్సిన మొత్తం కోల్పోవాల్సి ఉంటుందనే భావనతో అలా చేస్తారు. దీనివల్ల బెట్టింగ్ కాసేవాళ్లు భారీగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

ఆత్మహత్యలకు పాల్పడుతున్న బాధితులు

విద్యార్థులు, యువత సులభంగా డబ్బులు వస్తాయనే ఆశతో ఆన్‌లైన్‌లో యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకుని బెట్టింగ్ కాస్తున్నారు. చివరకు డబ్బులు పోగొట్టుకుని అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఇంటిదగ్గర డబ్బులు అడిగితే, ఎందుకు అంతమొత్తం అవసరమైందని అడుగుతారనే భయంతో స్నేహితుల వద్ద అప్పులుచేయడం, ఆన్‌లైన్ లోన్‌యాప్‌ల నుంచి రుణం తీసుకోవడం చేస్తున్నారు. లోన్‌యాప్‌ల నుంచి రుణాలు తీసుకుంటే తక్కువ వ్యవధిలోనే రెట్టింపు మొత్తాన్ని వాయిదాల రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ చెల్లించలేకపోతే వారి ఫొటోలు, వీడియోలను న్యూడ్‌గా మార్చి బాధితుల ఫోన్‌లోని కాంటాక్ట్ నంబర్లన్నింటికీ పంపిస్తామని బెదిరిస్తుంటారు. దీంతో ఆందోళనకు గురైన బాధితులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

కేసులు నమోదు చేయని పోలీసులు

బెట్టింగ్ కారణంగా ఎంతోమంది డబ్బులు పోగొట్టుకుంటున్నప్పటికీ పోలీసులు దీనిపై కేసులు నమోదు చేసేందుకు విముఖత చూపుతున్నారు. బెట్టింగ్‌ను రాష్ట్రంలో నిషేధించినప్పటికీ కొంతమంది ఆన్‌లైన్ ప్లాట్‌ఫారాలపై గుట్టుగా బెట్టింగ్ కాసి నష్టపోతున్నారని, అలాంటివారికి న్యాయం చేసే ప్రయత్నం చేస్తే బెట్టింగ్ జాడ్యం మరింత పెరిగిపోయే ప్రమాదం ఉందని పోలీసులు చెబుతున్నారు. అందువల్లే ప్రతిరోజూ ఎవరో ఒకరు ఫిర్యాదు చేసేందుకు వచ్చినా సరే తాము చేయగలిగిందేమీ లేదని చెప్పి వెనక్కి పంపేస్తున్నారు. దీంతో కేసులు నమోదుకావడం లేదు.

మద్యం లొల్లి

... 5వ పేజీ తరువాయి

రోడ్డులో ఆదిత్య గెస్ట్‌హౌస్ పక్కన పాత మద్యం దుకాణం పక్కనే కొత్త మద్యం దుకాణం ఏర్పాటుచేశారు. అక్కడ ప్రతి బాటిల్‌పై ఎమ్మార్పీ కంటే రూ.20 ఎక్కువ వసూలు చేశారు. దీనిపై మందుబాబులు ఆగ్రహం వ్యక్తంచేశారు. తక్కువ రేటు మద్యం అందుబాటులోకి తేకుండా ఎమ్మార్పీపై అదనపు మొత్తం వసూలు చేయడమేమిటని ప్రశ్నించారు. అయితే తమ యజమాని అలాగే విక్రయించాలని చెప్పారని, నచ్చితే కొనాలని, లేదంటే వెళ్లిపోవాలని అక్కడి సిబ్బంది చెప్పడంతో మందుబాబులు ఎదురు తిరిగారు. ఎమ్మార్పీపై రూ.20 అధికం అంటూ బోర్డు పెట్టి, మద్యం విక్రయించాలని, అప్పటివరకూ అమ్మడానికి వీల్లేదన్నారు. దీంతో దుకాణ నిర్వాహకులు చేసేది లేక షట్టర్ దించేసి అమ్మకాలు నిలిపివేశారు. మరికొన్ని ప్రాంతాల్లోనూ మద్యం అధిక ధరలకు అమ్మినట్టు తెలిసింది. ప్రభుత్వం పాత సరకునే సరఫరా చేయడం వల్ల అదే ధరలకు అమ్మాల్సి వస్తోందని, కొత్త స్టాకు వస్తే ధరలు తగ్గుతాయని కొందరు చెబుతున్నారు. అయితే ఇప్పటివరకూ అనుభవాలను దృష్టిలో ఉంచుకొని మందుబాబులు వారి మాటల్ని విశ్వసించడం లేదు. తమకు నమ్మకం లేదని, రేటు తగ్గిస్తామని చెప్పి, ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడమేమిటని ప్రశ్నిస్తున్నారు.

చైర్మన్ నియామకమెన్నడో?

... 5వ పేజీ తరువాయి

తీసుకోవడంలో కొన్ని ఇబ్బందులు ఎదురవుతాయనే భావనను పలువురు వ్యక్తం చేస్తున్నారు. అందువల్ల వీలైనంత త్వరగా ఛైర్మన్ ఎంపిక ప్రక్రియను పూర్తిచేస్తే వర్సిటీకి మేలు జరుగుతుందని పలువురు చెబుతున్నారు. గవర్నింగ్ బాడీలో ఛైర్మన్‌తో కలిపి 11 మంది ఉంటారు. పది మంది సభ్యుల్లో ముగ్గురు విద్యావేత్తలు, పారిశ్రామిక రంగానికి చెందినవారు ముగ్గురు, మెంటార్ ఇనిస్టిట్యూట్ అయిన ఖరగ్‌పూర్ ఐఐటీ నుంచి ఒక ప్రొఫెసర్, ఏయూ నుంచి ఒకరు, పెట్రో వర్సిటీ డైరెక్టర్, రిజిస్ట్రార్ సభ్యులుగా ఉంటారు. ఏదైనా నిర్ణయం తీసుకోవాలంటే ముందుగా గవర్నింగ్ బాడీ అనుమతి ఉండాలి. రెండేళ్లుగా గవర్నింగ్ బాడీకి పూర్తిస్థాయి ఛైర్మన్ లేకపోవడంతో నిర్ణయాలు తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నట్టు తెలుస్తోంది.

గ్రామీణ రహదారులకు మహర్దశ

... 5వ పేజీ తరువాయి

మండల, జడ్పీ రోడ్ల మరమ్మతులకు కూడా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. మండల స్థాయిలో రోడ్లను ఉపాధి నిధుల నుంచి చేపట్టవచ్చునని, జడ్పీ రోడ్లకు జడ్పీ నిధులు మంజూరు చేస్తామన్నారు. ఈ దశలో చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ చిన్నపాటి మరమ్మతులు చేయడం వల్ల ఉపయోగం లేదని, శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాలని సూచించారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పనులు వేగంగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పరవాడ జడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు తానాం రోడ్డు మరమ్మతులు చేయాలని కోరారు. తొలుత రెండో స్థాయీ సంఘ సమావేశానికి అధ్యక్షత వహించిన జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. గృహ నిర్మాణ శాఖ పరిధిలో లబ్ధిదారులకు బిల్లులు ఇంతవరకు చెల్లించలేదని, దరఖాస్తు చేసిన వారికి కొత్త ఇళ్లు మంజూరుకాలేదని వెంటనే బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. జల జీవన్ మిషన్ ద్వారా చేపట్టే పనులు త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఇదిలావుండగా కోరం లేనందున నాలుగో స్థాయీ సంఘ సమావేశాన్ని వాయిదా వేశారు.

27 నుంచి అనంత పద్మనాభుని పవిత్రోత్సవాలు

పద్మనాభం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని అనంత పద్మనాభుని దేవస్థానంలో ఈనెల 27 నుంచి పవిత్రోత్సవాలు నిర్వహించడానికి ఉత్సవ కమిటీ సమాయత్తమవుతోంది. ఈమేరకు ఆలయ ఈఓ నానాజీబాబు ఆధ్వర్యంలో స్థానిక కుంతీమాధవ స్వామి ఆలయంలో కమిటీ సభ్యులు బుధవారం సమావేశమయ్యారు. 27 నుంచి ఈనెల 30 వరకు ఉత్సవాలు నిర్వహించడానికి నిర్ణయించారు.

విద్యుదాఘాతంలో యువకుడి మృతి

ఎండాడ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : కొమ్మాదిలోని ఓ ఫంక్షన్‌లో విద్యుత్ లైట్ల అలంకరణ చేస్తుండగా యువకుడు ప్రమాదానికి గురై మృతి చెందాడు. పీఎంపాలెం పోలీసులు తెలి పిన వివరాలు ప్రకారం...కొమ్మాదిలో ఓ వివాహానికి విద్యుత్ దీపాలంకరణ కోసం నౌడగల లక్ష్మణ్ ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈమేరకు బుధవారం సిబ్బందితో కలిసి లైటింగ్ అమరుస్తుండగా బెవర సాయి కుమార్ (22) విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సాయికుమార్ అదే ప్రాంతంలోని రేవళ్లపాలెంలోని దేవీపట్నంలో ఉంటున్నాడు. అతనికి తల్లి సరస్వతి, సోదరుడు ఉన్నారు. సాయి మృతి చెందడంతో స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మిత్రులు దుర్మరణం





రాజేశ్, ప్రతాప్ (ఫైల్‌ఫొటోలు)

కశింకోట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మిత్రులు ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన కశింకోట వద్ద మంగళవారం అర్ధరాత్రి జరిగింది. సీఐ అల్లు స్వామినాయుడు తెలిపిన వివరాలిలా వున్నాయి. నక్కపల్లి మండలం నెల్లిపూడి గ్రామానికి చెందిన బర్నికుల రాజేశ్ (24), గునిపూడికి చెందిన కురందాసు ప్రతాప్ (26) స్నేహితులు. వీరు విశాఖపట్నంలో కారు డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. మంగళవారం రాత్రి విశాఖ నుంచి ద్విచక్రవాహనంపై నక్కపల్లి మండలానికి బయలుదేరారు. అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో కశింకోట వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. దీంతో ప్రతాప్, రాజేశ్ అక్కడికక్కడే మృతిచెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి కి తరలించారు. చేతికి అందివచ్చిన బిడ్డలు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

చెక్ పోస్టుల వద్ద అక్రమ వసూళ్లు!

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ పరిధిలోకి వాణిజ్య సంబంధిత వాహనాలు వెళ్లాలంటే నగదు చెల్లించుకోవాల్సిందేనన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎవరైనా డబ్బులు ఇవ్వకపోతే వారి వాహనం ముందుకు కదల్లేని పరిస్థితి నెలకొంటుందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. స్టీల్‌ప్లాంట్ పరిసరాల్లోకి వెళ్లే ప్రధాన మార్గంలో కూర్మన్నపాలెం జంక్షన్ ఉక్కు ఆర్చి వద్ద, అగనంపూడి నుంచి వెళ్లే రోడ్డులో శనివాడ వద్ద, దేశపాత్రునిపాలెం కూడలి వద్ద, కణితి మార్గంతో కలిపి నాలుగు చెక్ పోస్టులు ఉన్నాయి. అయితే ఆయా మార్గాల్లో ఏదైనా వాహనం వెళ్లాలంటే అక్కడి సిబ్బందికి నగదు సమర్పించుకోవాల్సి వస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ మార్గాల్లో ఎక్కువగా సిమెంటు లారీలు, గృహ నిర్మాణ సామగ్రికి సంబంధించిన వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి.

అలాగే గాజువాక నుంచి రూరల్ ప్రాంతాలకు వివిధ రకాల సామగ్రిని తీసుకువెళ్లేందుకు ఈ నాలుగు మార్గాలనే వినియోగిస్తుంటారు. అంతేకాకుండా కూర్మన్నపాలెం నుంచి అచ్యుతాపురం, ఎలమంచిలి, పరవాడ వెళ్లేందుకు, మరీ ముఖ్యంగా ఫార్మాసిటీలో కొన్ని సంస్థలకు పలు రకాల వస్తువులను తీసుకువెళ్లే వాహనాలు కూర్మన్నపాలెం ఆర్చి మార్గంలోనే ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటాయి. కొన్ని సమయాల్లో స్టీల్‌ప్లాంట్ మార్గంలో వాణిజ్య సంబంధిత వాహనాలు రాకపోకలు సాగించేందుకు పలు నిబంధనలు ఉన్నాయి. ఆయా సమయాల్లో కాకుండా ఇతర సమయాల్లో వాహనాలు రాకపోకలు సాగించాలంటే ఇక్కడ విధులు నిర్వహించే సిబ్బందికి నగదు ఇవ్వాల్సిందేనట.! ఒకవేళ డబ్బులు ఇవ్వకుంటే ఈ మార్గంలో వెళ్లడానికి వీల్లేదని, వాహనంలో ఏ వస్తువులు ఉన్నాయో చెప్పాలంటూ చెక్ పోస్టు సిబ్బంది బెదిరింపులకు పాల్పడుతున్నారని పలువురు వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఆయా మార్గాల్లో వాహనాల రాకపోకలపై కఠిన నిబంధనలు ఉన్నప్పటికీ అవేమీ పట్టించుకోకుండా సిబ్బంది వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. దీనిపై సంబంధిత అధికారులు దృష్టిసారించి తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



కూర్మన్నపాలెంలో ప్లాంట్ ఆర్చి వద్ద గల చెక్ పోస్టు

ఆ నాలుగు మార్గాల్లో నగదు చెల్లిస్తేనే వాహనాలు ముందుకు..

లేకుంటే సిబ్బంది బెదిరింపులకు పాల్పడుతున్నారని వెల్లువెత్తుతున్న ఆరోపణలు

మద్యం దుకాణాల ఏర్పాటులో గందరగోళం

▸ గాజువాక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎన్ని షాపులు వస్తాయో తెలియని పరిస్థితి

గాజువాక, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గాజువాక నియోజకవర్గంలో నూతన మద్యం షాపులు ఏర్పాటు గందరగోళంగా మారింది. గాజువాక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎన్ని కొత్త షాపులు వస్తాయో అధికారులకు సైతం అర్థం కాని పరిస్థితి నెలకొంది. జీవీఎంసీ పరిధిలో 196 వరకు కొత్త మద్యం దుకాణాలను ఏర్పాటు చేసేందుకు లాటరీ పద్ధతిలో కేటాయింపులు చేసిన సంగతి తెలిసిందే. అయితే జీవీఎంసీ పరిధి అని పేర్కొనడంతో నిర్వాహకులు ఎక్కడ మద్యం దుకాణం పెడితే ఎక్కువ ఆదాయం వస్తుందన్న దానిపై ఆలోచనలో పడ్డారు. గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో గతంలో మద్యం వ్యాపారాలు సాగించినవారు ఇప్పుడు కూడా లాటరీలో దుకాణం పొంది ఎక్కడ వాటిని ఏర్పాటు చేయాలోనని వెతుకులాటలో నిమగ్నమయ్యారు. బుధవారం సాయంత్రానికి ఇక్కడి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ప్రొవిజనల్ లైసెన్స్ పొందిన 13 మంది మద్యం డిపోకు వెళ్లి తమ షాపులకు సరకును తీసుకువెళ్లారు. గురువారం నుంచి వీరు అమ్మకాలు చేపట్టనున్నారు.

కాగా గతంలో గాజువాకలో 35 వరకు మద్యం షాపులు ఉండగా, ఇప్పుడు మల్కాపురం ప్రాంతంలోని రెండు వార్డులు ఇక్కడి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో చేరాయి. అందువల్ల మల్కాపురం నుంచి అగనంపూడి వరకు కొత్తగా ఎన్ని షాపులు వస్తాయన్నది మూడు నాలుగు రోజుల్లో లెక్క తేలనున్నది. ఇదిలావుండగా ఇంతవరకు సాగిన ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఎంత అమ్మకాలు జరిగాయి, ఇంకా నిల్వ ఎంత ఉందో పరిశీలించి.. ఆయా షాపుల్లో మిగిలిన మద్యంతో పాటు సామగ్రిని డిపోలకు తరలించే పనిలో ఉన్నట్టు ఎక్సైజ్ సీఐ నాగ శ్రీనివాసరావు తెలిపారు.

కణితి రోడ్డులో ట్రాఫిక్ ఇబ్బందులు

గోతులమయంగా రహదారి మారడంతో నిత్యం ఇదే పరిస్థితి

గాజువాక, అక్టోబరు 16: కణితి రోడ్డులోని వై-జంక్షన్‌లో నిత్యం ట్రాఫిక్ సమస్యలతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో ఈ మార్గంలో ప్రయాణించాలంటేనే హడలెత్తిపోతున్నామని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో రోడ్డు చాలా వరకు మరమ్మతులకు గురవ్వడంతో తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. గాజువాక నుంచి స్టీల్‌ప్లాంట్, రూరల్ ప్రాంతాలు, బీసీ రోడ్డు, శ్రీనగర్ వంటి ప్రాంతాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. అయితే ఈ రోడ్డులో జగ్గు జంక్షన్ నుంచి స్టీల్‌ప్లాంట్ చెక్‌పోస్టు వరకు పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీటితో గోతులు నిండిపోవడంతో వాహనదారులు నానాపాట్లు పడుతున్నారు. ప్రతిరోజు ఉదయం ఎనిమిది నుంచి తొమ్మిది గంటల వరకు ఈ మార్గం ఉద్యోగులు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులతో కిటకిటలాడుతుంది. గోతులతో నిండిన ఈ రోడ్డులో వాహనాలు నెమ్మదిగా రాకపోకలు సాగిస్తుండడంతో ట్రాఫిక్ జామ్ అవుతుండడం సర్వసాధారణంగా మారింది. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఈ మార్గంలో జగ్గు జంక్షన్ నుంచి సుందరయ్యకాలనీ కూడలి వరకు వెళ్లేందుకు సుమారు రెండు గంటల సమయం పట్టిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు పోలీసులను నియమించాలని, అలాగే రహదారికి మరమ్మతులు చేయాలని పలువురు వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



బుధవారం ట్రాఫిక్ స్తంభించడంతో నిలిచిన వాహనాలు

'సెయిల్‌లో స్టీల్‌ప్లాంటును విలీనం చేయాలి'

కూర్మన్నపాలెం, అక్టోబరు 16: (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కేంద్రంతో చర్చించి సెయిల్‌లో స్టీల్‌ప్లాంట్ విలీనమయ్యేలా చూడాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు యూ.రామస్వామి కోరారు. **స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు** బుధవారం నాటికి 1,343వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు, అమరావతి నిర్మాణాన్ని కూటమి నాయకులు ఏ విధంగా ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారో.. అలాగే ఉక్కు కర్మాగార పరిరక్షణకు నడుం బిగించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంటును నష్టాల బాటకు మళ్లించడం, కార్మికులకు జీతాలు ఇవ్వలేని దుస్థితికి దిగజార్చడం పారిశ్రామిక అభివృద్ధా అని ప్రశ్నించారు. కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ రంగాల వల్లే దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉంటుందన్నారు. ఎంతోమంది త్యాగాలతో ఏర్పడిన ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరిస్తే ఆంధ్రులకు తీరని అన్యాయం చేసిన వారవుతారన్నారు. నాయకుడు ఎస్.రామారావు మాట్లాడుతూ సెయిల్‌లో స్టీల్ ప్లాంటును విలీనం చేయడమే సమస్యకు శాశ్వత పరిష్కారమన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వరరావు, భానుమూర్తి, గంగాధర్, నీలకంఠం, వెంకటరావు, శ్రీనివాసరెడ్డి, భానుమూర్తి, గంగవరం గోపి, వేములపాటి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం వాల్ పోస్టర్లు ఆవిష్కరణ

అక్కిరెడ్డిపాలెం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జస్ట్ ఇన్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకి కుంచారావు జ్ఞాపకార్థం ఈ నెల 18న తుంగ్లాం కాలనీలో నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరానికి సంబంధించిన వాల్ పోస్టర్లను 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి ఆవిష్కరించారు. బుధవారం తుంగ్లాంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రక్తదానం పట్ల అపోహలను యువత విడనాడి రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన

కూర్మన్నపాలెం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి కణితిలో అభివృద్ధి పనులను బుధవారం కార్పొరేటర్ బొండా జగన్ అధికారులతో కలిసి పరిశీలించారు. కాలువల్లో మురుగు నీరు నిల్వ లేకుండా పనులను నాణ్యతతో పూర్తి చేయాలని కాంట్రాక్టరుకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్టు జగన్ పేర్కొన్నారు. టీడీపీ నాయకుడు ఎస్ఎస్ విజయరామరాజు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

అప్పన్నకు తులసీ దళార్చన

సింహాచలం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా సహస్రనామ తులసీ దళార్చన గురు వారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవ, ప్రభాతారాధనలు ముగిసిన తరువాత ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ సహస్రనామావళి పఠిస్తూ తులసీ దళాలతో అర్చన చేశారు. స్వామివారికి మంత్ర పుష్పం కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

▸ 'ఉక్కు' పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం ▸ గాజువాకలో ట్రాఫిక్, కాలుష్య నివారణకు కృషి ▸ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు తాము కట్టుబడి ఉన్నామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 88వ వార్డు వైజాగ్ ప్రొఫైల్స్ గ్రీన్ సిటీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం జరిగిన టీడీపీ, జనసేన, బీజేపీ నియోజకవర్గ నాయకుల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గాజువాక నియోజకవర్గ ప్రజలు భారీ మెజారిటీతో తనను గెలిపించారని, వారికి ఎప్పుడూ సేవకుడిగా ఉంటానన్నారు. తిరుమల లడ్డూలో కల్తీ జరిగిందన్న సత్యం భవిష్యత్తులో నిరూపించబడుతుందన్నారు. గాజువాకలో ట్రాఫిక్, కాలుష్య నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పేదలకు, విద్య, వైద్యాన్ని ఉచితంగా అందించేందుకు, నిరుద్యోగులకు ఉపాధిని కల్పించేందుకు, తాగు, సాగునీరు అందించేందుకు చెరువులను అభివృద్ధి చేస్తామని, రోడ్లకు మరమ్మతులతో పాటు నూతన రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలను రూపొందిస్తుందని పల్లా శ్రీనివాసరావు అన్నారు. విశాఖ నగరాభివృద్ధిలో భాగంగా అగనంపూడి నుంచి ఆనందపురం వరకు సుమారు 12 వంతెనల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. ఉక్కు నిర్వాసితులకు అండగా ఉంటానన్న మాటకు తాను కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. వైసీపీ పాలనలో ఎన్ని ఇబ్బందులకు గురయ్యామన్న విషయాన్ని ప్రజలు గ్రహించారన్నారు. కూటమి ప్రభుత్వ పాలన పట్ల ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని పల్లా పేర్కొన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్, కార్పొరేటర్లు మొల్లి ముత్యాలనాయుడు, గంధం శ్రీనివాస్, రౌతు శ్రీనివాస్, రాజాన రామారావు, బొడ్డు నరసింహపాత్రుడు, నాయకులు నల్లారు సూర్యనారాయణ, ప్రసాదుల శ్రీనివాస్, పుచ్చా విజయ్‌కుమార్, సర్వసిద్ధి అనంతలక్ష్మి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణంరెడ్డి నరసింగరావు, జనసేన నేత కోన తాతారావు, గడసాల అప్పారావు, పులి వెంకట రమణారెడ్డి, విల్లా రామ్మోహన్‌కుమార్, ఎస్ఎస్ విజయరామరాజు, వేగుంట శ్రీనివాస్, గొలగాని సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.



గాజువాక నియోజకవర్గ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

సీఎస్‌సీ సంస్థతో విజ్ఞాన్ ఎంవోయూ



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఇరు సంస్థల ప్రతినిధులు

అగనంపూడి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దువ్వాడలోని విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల కౌన్సిల్ ఫర్ స్కిల్ అండ్ కాంపిటెన్సిస్ (సీఎస్‌సీ) సంస్థతో ఎవోఓయూ కుదుర్చుకుంది. ఈ మేరకు బుధవారం సీఎస్‌సీ సంస్థ సలహాదారుడు వై.రామ్మోహన్‌రావుతో ప్రిన్సిపాల్ జె.సుధాకర్ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ సాంకేతిక, సీ-డాక్, త్రీడీ ప్రింటింగ్, రోబోటిక్ ప్రాసెసింగ్‌పై ఎస్సీ, ఎస్టీ విద్యార్థులతో పాటు అధ్యాపకులకు ఉచిత శిక్షణతో పాటు ఉపాధి నైపుణ్యాలను అందిస్తామని రామ్మోహన్‌రావు తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ దుర్గా శ్యామ్‌ప్రసాద్, కాంత్రికుమార్, డీన్‌లు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నిలయంగా పెందుర్తి బీఆర్‌టీఎస్ రోడ్డు

▸ అడుగడుగునా గోతులమయం

▸ ఎక్కడికక్కడ డివైడర్ల తొలగింపు

పెందుర్తి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వేగంగా గమ్యం చేరుకునేందుకు నిర్మించిన మూడు వరసల రహదారి తగిన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. పెందుర్తి నుంచి వేపగుంట వరకు ఉన్న బీఆర్టీఎస్ రహదారి మృత్యుమార్గంగా మారింది. రహదారిపై అడదిడ్డంగా ఉన్న విద్యుత్ తీగలు, గుంతలు పడిన రోడ్డు, రాళ్లు, పగిలిపోయిన డివైడర్లు, ఫ్లెక్సీలతో భీతిగొల్పుతోంది.

యమపాశాల్లా విద్యుత్ తీగలు

బీఆర్టీఎస్ రహదారిపై ఏర్పాటుచేసిన సెంటర్ లైటింగ్ స్తంభాలకు వేసిన విద్యుత్ తీగెలు భీతిగొల్పుతున్నాయి. పలు స్తంభాలకు రంధ్రాలు పడి, భూగర్భంలో అమర్చిన తీగెలు బయటకు వచ్చేశాయి. కొన్ని తీగలకు టేపులు వేసినా, శాశ్వత ప్రాతిపదికన చర్యలు లేవు. ఈ సెంటర్ లైన్లో వాహనాలు వెళ్తే ప్రమాదాలు సంభవించే వీలుంది. ఇటీవల వేపగుంటలో బీఆర్టీఎస్ రహదారిపై విద్యుత్ తీగలు చొచ్చుకుని రావడంతో ఆటలాడుకుంటున్న బాలుడు షాక్‌తో మృతిచెందాడు.



డివైడర్ మధ్యలో ప్రమాద భరితంగా విద్యుత్ తీగలు

ప్రాణాంతకంగా డివైడర్లు

బీఆర్టీఎస్ సెంటర్ రోడ్డుకు వేసిన డివైడర్లు వాహచోదకులకు ప్రాణాంతకంగా మారుతున్నాయి, కొన్ని చోట్ల డివైడర్లు పగలి రాళ్లు బయటికి వచ్చాయి. పెందుర్తిలో భారీ షాపింగ్ మాల్‌కు చేరేందుకు వీలుగా డివైడర్‌ను తొలిగించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యమైన కూడళ్లలో షాపుల ఎదురుగుండా ఉన్న డివైడర్లను ఇష్టానుసారం తొలగించేశారు. దీని వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయని వాహన చోదకులు ఆరోపిస్తున్నారు. ఇక రహదారి గుంతలు, రాజకీయ నేతలను ఆహ్వానించేందుకు వీలుగా ఏర్పాటు చేసే ఫ్లెక్సీలు కట్టేందుకు తీసిన గుంతలు ప్రమాద హేతువులవుతున్నాయి.



పెందుర్తి వద్ద బీఆర్టీఎస్ డివైడర్‌ను తొలగించిన దృశ్యం

హెచ్‌పీసీఎల్‌లో సైరన్‌తో ఆందోళన

▸ మాక్ డ్రిల్‌గా ప్రకటించిన యాజమాన్యం

మల్కాపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): హెచ్‌పీసీఎల్‌లో బుధవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో ప్రమాద సూచికను తెలియజేసే సైరన్‌ల మోత..అదే సమయంలో మల్కాపురం ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పారిశ్రామిక ప్రాంత వాసులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సైరన్ మోగిన వెంటనే ప్రమాదం జరిగి ఉంటుందని భావించారు. దీంతో విషయం తెలుసుకునేందుకు ఆసక్తి చూపారు. దీనిపై హెచ్‌పీసీఎల్ అధికారులను ఫోన్‌లో సంప్రదించగా ఉద్యోగులు అప్రమత్తంగా ఉన్నారో లేదో తెలుసుకోవడానికి మాక్ డ్రిల్ నిర్వహించామని వారు వివరించారు. ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులకు విషయం తెలియకపోవడంతో ఆందోళన చెందారు.

నేడు ఎమ్మెల్యే పంచకర్ల పర్యటన

పెందుర్తిరూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు గురువారం పెందుర్తి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించనున్నారు. ఉదయం జెర్రిపోతులపాలెం, పెదగాడి, చింతల అగ్రహారం, రాజయ్యపేట, సరిపల్లి, జంగాలపాలెంలో పర్యటిస్తారు. మధ్యాహ్నం గవరపాలెం పంచాయతీ గొల్లలపాలెం సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం పెందుర్తి తాండ్రపాపారాయుడు కల్యాణ మండపంలో విశ్వకర్మ యోజన అవగాహన సదస్సులో పాల్గొంటారు.

త్రినాథపురంలో అన్న సమారాధన

సింధియా, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దుర్గాదేవి అమ్మవారి మహోత్సవాలను జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురం జంక్షన్లో నిర్వహించారు. కొండ దేవతమ్మ ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో బుధవారం అన్నసమారాధనఏర్పాటు చేశారు. రాజు, నరసింగరావు, అప్పారావు, పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **వేట్టయాన్:** సంగం, రమాదేవి, వెంకటేశ్వర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, లక్ష్మి (గాజువాక), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాత (తగరపువలస)
- **విశ్వం:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **జనక అయితే గనక:** శారద, కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **మా నాన్న సూపర్‌హీరో:** గోకుల్, మౌర్య (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)
- **శ్వాగ్:** శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్-2 (పెందుర్తి), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)
- **దేవర:** మెలోడి, జగదాంబ, శరత్, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 49, టమాటా 50, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 28, పచ్చిమిర్చి 56, కాకరకాయలు 32, బీరకాయలు 40, ఆనపకాయ 28, కాలీఫ్లవర్ 44, క్యాబేజీ 32, క్యారెట్ 56 దొండకాయలు 36, బంగాళదుంపలు 30, అరటికాయ (పెద్దది) 8, మునక్కాడలు (కిలో) 82, అల్లం (పాతది) 100, బరబాటి 44, ముల్లంగి 30, నిమ్మకాయలు(కిలో) 85, గోరుచిక్కుడు 30, దోసకాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 26, బీన్స్ (పెన్సిల్) 130, పొటల్స్ 66, కీరదోస 30, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40, చిలగడదుంపలు 32, కంద 62, దేముడు చిక్కుడు 75, కొండఉసిరి 85, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, క్యాప్సికం రెడ్ పెండలం 30, మామిడి అల్లం 74, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	120
ఫారం ధర	149
విత్ స్కిన్	250
స్కిన్‌లెస్	260

సరిపల్లిలో ఘనంగా దుర్గాదేవి నిమజ్జనోత్సవం

పెందుర్తి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సరిపల్లిలో నిర్వహిస్తున్న దుర్గాదేవి మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. సాయంత్రం దేవి విగ్రహాన్ని ఘనంగా నిమజ్జనం చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో అమ్మవారి విగ్రహాన్ని ఉంచి, మేళతాళాలు,భజనలు, కోలాటాలు, సంప్రదాయ నృత్యాలతో పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. మహిళలకు నిర్వహించన ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



దుర్గాదేవిని ఊరేగిస్తున్న దృశ్యం

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కార్పొరేటర్ శంకుస్థాపన

ఎన్ఏడీ జంక్షన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్ కొండవాలు ప్రాంతంలో సుమారు రూ.10లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, డ్రైన్స్ పనులకు బుధవారం కార్పొరేటర్ బొమ్మిడి రమణ శంకుస్థాపన చేశారు. వార్డులో మౌలిక వసతుల కల్పనపై ఎమ్మెల్యే గణబాబు సూచనల మేరకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ ఏఈ వెంకటలక్ష్మి, టీడీపీ నేతలు నరవ పైడిరాజు, శ్రీను పట్నాయక్, గౌరీశ్, నాగేశ్వరరావు, కుమారమ్మ, రాధ, కళ్యాణి పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ బొమ్మిడి రమణ

నిత్యావసర సరకుల ధరలను నియంత్రించాలి : సీపీఐ

మల్కాపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా పెరుగుతున్న నిత్యావసర సరకుల ధరలను వెంటనే తగ్గించాలని కోరుతూ సీపీఐ నాయకులు బుధవారం నిరసన తెలిపారు. మల్కాపురం శి వారు ప్రాంతంలోని మార్కెట్ల వద్ద కరపత్రాలను పంపిణీ చేశారు. ధరలను తగ్గించేవరకు వివిధ రూపాలలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కాండ్రేగుల సత్యాంజనేయ, గుడాల రాంబాబు, గోపి, బాలాజీ, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

58వ వార్డులో సామాజిక భవనం ప్రారంభం

మల్కాపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): యువతకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో పరిశ్రమల యాజమాన్యాలు తగిన శిక్షణ అందించాలని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు పిలుపునిచ్చారు. గ్రేటర్ 58వ వార్డు ఎదురువానిపాలెంలో కోరమాండల్ ఎరువుల కర్మాగారం సౌజన్యంతో నిర్మించిన సామాజిక భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాజిక సేవ కార్యక్రమాలు అమలుచేయడంలో కోరమాండల్ దూసుకు వెళ్తోందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులలో శిక్షణ ఇచ్చే కార్యక్రమం కూడా చేపట్టడం అభినందనీయమన్నారు. ఇప్పటికే రూ.10కే వైద్యం అందించేందుకు ఆస్పత్రిని నిర్మించిందని గుర్తుచేశారు. ఈ ప్రాంతంలోని పారిశ్రామికవేత్తలతో మాట్లాడి ప్రజలందరికీ ఉపయోగపడేలా పెద్ద ఆస్పత్రిని నిర్మించే యోచనలో ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో కోరమాండల్ ఎరువుల కర్మాగారం వైస్ ప్రెసిడెంట్ (యూనిట్ హెడ్) జ్ఞానసుందరం, డీజీఎం (హెచ్ఆర్) రెడ్డిపల్లి శ్రీనివాసరావు, సీఎస్ఆర్ ముఖ్య అధికారి జయగోపాల్, సీనియర్ మేనేజర్ శ్రీకాంత్, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ నారాయణ పాత్రుడు, డిప్యూటీ మేనేజర్ వెంకటరమణ, స్టేట్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అంగ దుర్గాప్రశాంతి, టీడీపీ నేత పొత్తబత్తుల శ్రీను, అప్పలస్వామి పాల్గొన్నారు.



సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

బీజేపీలో చేరిన 40వ వార్డు మహిళలు

సింధియా, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 40వ వార్డుకు చెందిన సుమారు 40 మంది మహిళలు బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఏకేసీ కాలనీకి చెందిన మేఘన దుర్గా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం వార్డు బీజేపీ అధ్యక్షురాలిగా మేఘన దుర్గను నియమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. వార్డు ప్రజలకు ఎల్లప్పుడూ, అందుబాటులో ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రొఫెసర్ ఎన్.విజయ్‌మోహన్

అంతర్ కళాశాలల కబడ్డీ టోర్నీ ప్రారంభం

విశాఖపట్నం (స్పోర్ట్సు), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఏయూ స్పోర్ట్సు బోర్డు నిర్వహిస్తున్న అంతర్ కళాశాల పురుషుల మహిళల కబడ్డీ చాంపియన్‌షిప్ టోర్నీ బుధవారం ప్రారంభమైంది. ఏయూ ఇండోర్ స్పోర్ట్సు హాల్లో జరుగుతున్న ఈ పోటీలకు ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్సు సైన్సెస్ డైరక్టర్ ప్రొఫెసర్ ఎన్.విజయ్‌మోహన్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏయూ పరిధిలోని 18 కాలేజీల జట్లు పాల్గొనడం ఆహ్వానించదగ్గ విషయమని, రెండు రోజులపాటు జరిగే ఈ టోర్నీలో ప్రతిభ చూపిన క్రీడాకారులు ఆలిండియా అంతర్ వర్సిటీ కబడ్డీ టోర్నీలో పాల్గొనే ఆంధ్ర విశ్వవిద్యాలయం జట్టుకు ఎంపికవుతారని తెలిపారు. వర్సిటీ అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్సు సైన్సెస్ విభాగాధిపతి డాక్టర్ ఏ.పల్లవి, ఐఐపీఈ స్పోర్ట్సు ఆఫీసర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కాలేజి పిజికల్ ఎడ్యుకేషన్ హెడ్ డాక్టర్ వై.పోలిరెడ్డి, బుల్లయ్య కాలేజి పిజికల్ ఎడ్యుకేషన్ హెడ్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, వివిధ కాలేజీల ఫిజికల్ డైరక్టర్లు డాక్టర్ బీఆర్ఎస్.లక్ష్మణరెడ్డి, గంగాభవాని, కబడ్డీ కోచ్ డాక్టర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్కూలు పిల్లల ఆటోకు తప్పిన పెను ప్రమాదం

- అనారోగ్యానికి గురై అడ్డదిడ్డంగా వాహనాన్ని నడిపిన ఆటో డ్రైవర్
- స్థానికుల అప్రమత్తతతో తప్పిన ముప్పు


ప్రమాదానికి గురైన ఆటో వద్ద గుమిగూడిన జనం

మద్దిలపాలెం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ పిల్లలు ప్రయాణిస్తున్న ఆటోకు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. మద్దిలపాలెం కృష్ణా కళాశాల రోడ్డులో సోమవారం ఉదయం స్కూల్ ఆటో నడుపుతున్న డ్రైవర్‌కు హఠాత్తుగా కళ్లు తిరిగినట్టు అనిపించింది. దీంతో ఆటోను కంట్రోల్ చేయలేక పోయాడు. ఆటోమోటివ్ డౌన్ రోడ్డులోకి వస్తూ అడ్డదిడ్డంగా పోనిచ్చాడు. ద్విచక్రవాహనాలను ఢీకొట్టుకుంటూ దూసుకెళ్లాడు. రోడ్డుపై అడ్డదిడ్డంగా వెళ్తున్న ఆటోలో స్కూల్ పిల్లలు ఉండడం చూసి స్థానికులు ఆటో వెనుక పరుగులు పెట్టి ఆపారు. ఆటో డ్రైవర్ నీరసంగా కదలలేని స్థితిలో ఉండడంతో నీరు తాగించి లేవనెత్తారు. ఆటోలో ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి విషయం చెప్పారు. ఆందోళన చెందిన పేరెంట్స్ ఆటో వద్దకు చేరుకుని తమ పిల్లలు క్షేమంగా ఉండడంతో పాఠశాలకు తీసుకుని వెళ్లారు. గత కొన్ని నెలల కిందట ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద జరిగిన స్కూల్ ఆటో ప్రమాదం అందరికీ తెలిసిందే. పోలీసులు కూడా ఆటో డ్రైవర్లకు జాగ్రత్తలపై కౌన్సెలింగ్ చేశారు. ముఖ్యంగా మితిమీరిన వేగం, అనారోగ్యంతో ఆటోలు నడపకూడదని సూచించారు. ఇవేవి పట్టని ఆటో డ్రైవర్లు తమ ఆరోగ్య పరిస్థితి విషమించినా ఆటోలు తీస్తున్నారు. ఈ నిర్లక్ష్యమే ఉదయం ఆటో ప్రమాదానికి దారి తీసింది. స్థానికులు ఆటో వెంట వెళ్లి ఆపడంతో పెనుప్రమాదమే తప్పింది.

గ్రామీణ రహదారులకు మహర్దశ

... 5వ పేజీ తరువాయి

మండల, జడ్పీ రోడ్ల మరమ్మతులకు కూడా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. మండల స్థాయిలో రోడ్లను ఉపాధి నిధుల నుంచి చేపట్టవచ్చునని, జడ్పీ రోడ్లకు జడ్పీ నిధులు మంజూరు చేస్తామన్నారు. ఈ దశలో చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ చిన్నపాటి మరమ్మతులు చేయడం వల్ల ఉపయోగం లేదని, శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాలని సూచించారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పనులు వేగంగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పరవాడ జడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు తానాం రోడ్డు మరమ్మతులు చేయాలని కోరారు. తొలుత రెండో స్థాయీ సంఘ సమావేశానికి అధ్యక్షత వహించిన జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. గృహ నిర్మాణ శాఖ పరిధిలో లబ్ధిదారులకు బిల్లులు ఇంతవరకు చెల్లించలేదని, దరఖాస్తు చేసిన వారికి కొత్త ఇళ్లు మంజూరుకాలేదని వెంటనే బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. జల జీవన్ మిషన్ ద్వారా చేపట్టే పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఇదిలా వుండగా కోరం లేనందున నాలుగో స్థాయీ సంఘ సమావేశాన్ని వాయిదా వేశారు.

నర్సింగ్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ

మహారాణిపేట, అక్టోబరు 16 : కేజీహెచ్‌లో ఏపీ నర్సింగ్ అసోసి యేషన్ ఎన్నికల ప్రక్రియ బుధవారం నుంచి ప్రారం భమైంది. అసోసియేషన్ కార్యాలయంలో పోలింగ్ అధికారిగా బి.శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో నామి నేషన్ల స్వీకరణ చేపట్టారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారితో పాటు ఐదుగురు కార్యవర్గ సభ్యులకు పోటీ జరగనుండగా మొత్తం 19 నామినేషన్లు దాఖలు అయ్యాయి. 17న నామినేషన్ల పరిశీలన, 18న ఉప సంహరణ, 23న ఎన్నికల జరగనున్నాయి. ఎన్నికల్లో మొత్తం 520 మంది నర్సింగ్ సిబ్బంది ఓటుహక్కు వినియోగించుకోనున్నారు.

తవ్వేయడం.. తప్పుకోవడం!

- యూజీడీ పనుల కోసం రహదారులపై గోతులు
- పనులు పూర్తయినా పునరుద్ధరణ చేపట్టని వైనం
- బురదమయంగా రహదారులు


శివాజీపాలెం కృష్ణుడు గుడి ప్రాంతంలో అండర్ డ్రైనేజీ పనులు పూర్తి చేసి వదిలేసిన రోడ్డు

జీవీఎంసీ 22వ వార్డులో భూగర్భ డ్రైనేజీ పనుల కోసం సిమెంట్ రోడ్డులను తవ్వారు. పనులు పూర్తి చేసి అయిదు నెలలు దాటినా రహదారుల పునరుద్ధరణ మాత్రం చేపట్టలేదు. పైపులైన్లు వేసిన అనంతరం గోతుల్లో మట్టి వేసి కప్పేయడంతో రోజురోజుకూ రహదారులు కుంగిపోయి అధ్వానంగా తయారయ్యాయి. వర్షాలకు పరిస్థితి మరింత దారుణంగా తయారైంది.

మద్దిలపాలెం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) :

శివాజీపాలెం, పీతలవానిపాలెం, మంగాపురం కాలనీ ఏరియాల్లో అయిదు నెలల కిందట అండర్ డ్రైనేజీ వ్యవస్థ పనులు చేపట్టారు. డ్రైనేజీ పైపులు వేయడానికి ఆయా వీధుల్లో సిమెంట్ రోడ్డులను తవ్వేశారు. అయితే పైపులు అమర్చిన తర్వాత కాంక్రీట్‌తో రోడ్లను యథావిధిగా నిర్మాణం చేపట్టాలి. కానీ మట్టి వేసిన చోట కాంక్రీట్ పనులు చేపట్టకుండా పైపైన మట్టితో గోతులను పూడ్చి అంతటితో వదిలేశారు. అంతర్గత రోడ్లపై గుంతలతో పాటు మ్యాన్‌హోల్స్ పై కప్పులు రోడ్డు కంటే ఎత్తుగా ఉండటంతో వాహన రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోంది. రోడ్డు మధ్యలో మట్టితో వేసి వదిలేయడంతో వర్షం పడినప్పుడు గుంతల్లో నీరు చేరి బురదమయంగా తయారవుతోంది. బురద రోడ్డులో నడవడానికి పాదచారులు, ద్విచక్ర వాహనదారులు నానా యాతన పడుతున్నారు. పాదచారులు ఆ రహదారుల్లో నడవలేని పరిస్థితి నెలకొంటోంది. రహదారులపై చేపట్టే పనులు పది, పదిహేను రోజుల్లో పూర్తి అయిపోయేవే అయినప్పటికీ నెలలు గడిచినా పూర్తి చేయడం లేదు. రోజూ వివిధ పనులపై బయటకు వెళ్లే స్థానికులు, వృద్ధులు, పాఠశాలల పిల్లలు ఈ రోడ్డుల్లో వెళ్లడానికి అగచాట్లు పడుతున్నారు. అండర్ డ్రైనేజీ పనులు పూర్తయిన వెంటనే రోడ్ల పునరుద్ధరణను పర్యవేక్షించాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. ఇప్పటికైనా ఈ సమస్యపై ఉన్నతాధికారులు దృష్టి సారించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


పీతలవానిపాలెంలో నడవడానికి వీలు లేని పరిస్థితి

సంక్షిప్తంగా..

పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత రేపు

ఆరిలోవ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పైనాపిల్ కాలనీ, ఎస్ఎస్‌లో గల పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. పైనాపిల్ కాలనీ 33/11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల్లో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పైనాపిల్ కాలనీ, ముడసర్లోవ, శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం, ఎస్ఎస్ఎన్‌నగర్, కామాక్షినగర్, సీఐడీ కార్యాలయం, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, శ్రీకాంత్‌నగర్, కనక మహాలక్ష్మి నగర్, శివాజీవ్‌నగర్ ఆరిలోవ పోలీసు స్టేషన్‌ప్రాంతం, ఆరిలోవ టీఐసీ పాయింట్, ఆరిలోవ చివరి బస్టాప్, పాండురంగపురం, నెహ్రూనగర్, శివాజీ నగర్, ప్రగతినగర్, తదితర ప్రాంతాల్లో విద్యుత్‌సరఫరా నిలిపి వేస్తున్నట్టు వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నిత్యావసర ధరలు నియంత్రించాలి : సీపీఐ



ఆందోళన నిర్వహించి నినాదాలు చేస్తున్న సీపీఐ నేతలు

ఆరిలోవ, అక్టోబరు 16 : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిత్యావసర వస్తువులు ధరలు ఆకాశానికి తాకుతున్నాయని సీపీఐ తూర్పు నియోజకవర్గ కార్యదర్శి ఎస్‌కె రెహమాన్ అన్నారు. బుధవారం ఉదయం ఆరిలోవ అంబేడ్కర్ జంక్షన్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధరల పెరుగుదలను నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. బాలాజీనగర్ వరకు పాదయాత్ర చేపట్టి కరపత్రాలు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఉచిత ఇసుక ఇస్తామని వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత అందుబాటులోకి లేకుండా చేసారని విమర్శించారు. దీనివల్ల భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక, పెరిగిన ధరలకు బతకలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఇసుక అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యురాలు దేవుడమ్మ, కార్యదర్శి కెల లక్ష్మణరావు, సహకార కార్యదర్శి కాచు బాబు, పి. పుష్పలత చిరంజీవి, నూకరాజు, ఎ.సత్తిబాబు, వెంకటరావు పాల్గొన్నారు

కిక్కిరిసిన రైతు బజార్

- ఉదయం నుంచి రాత్రి వరకూ జనం
- టమాటా కౌంటర్ల వద్ద రద్దీ


టమాటా కోసం క్యూ కట్టిన జనం

సీతమ్మధార, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బుధవారం ఒకవైపు వాన పడటం, మరో వైపు ఎండ కాయడంతో సీతమ్మధార రైతు బజార్‌లో రైతులు, కొనుగోలుదారులు ఇబ్బందులు పడ్డారు. కిలో రూ.50లకు విక్రయిస్తున్న టమాటాల కోసం జనం క్యూ కట్టారు. రైతుబజార్‌లో మూడు స్టాళ్లలో టమాటాలు అందుబాటులో ఉంచినా ప్రతి కౌంటర్ వద్ద రద్దీ నెలకొంది. ఉల్లిపాయలు అందుబాటులో లేకపోవడంతో కొనుగోలుదారులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

నగరంలోని అతి పెద్ద రైతు బజార్‌లో ఒక్కటైన ఎంవీపీ రైతుబజార్‌తో పాటు రైతుబజార్‌కు కూడా బుధవారం సెలవు కావడంతో సీతమ్మధార రైతు బజార్‌కు ఉదయం నుంచి పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో జనం కూరగాయలు కొనుగోలు చేయడానికి వచ్చారు. దీంతో ఉదయం నుంచి రాత్రి వరకు బజార్ జనంతో కిక్కిరిసింది.

దసరా పండుగ తర్వాత రెండు రోజులు సెలవులు తీసుకొని నగరానికి వచ్చిన జనం అధిక సంఖ్యలో వచ్చి కూరగాయలు కొనుగోలు చేశారు. సీతమ్మధార రైతుబజార్ మంగళవారం సెలవు కావడంతో కూడా జనం పెద్ద ఎత్తున రావడానికి మరో కారణం.

బీఆర్టీఎస్ రోడ్డులో చెట్లు, పూల మొక్కల నరికివేత

- బోసిపోయిన రహదారి
- వాహన చోదకులు, స్థానికుల విస్మయం
- అధికారుల నిర్ణయంపై ఆగ్రహం


నరికివేతకు గురైన డివైడర్లపై ఉన్న మొక్కలు

ఆరిలోవ, అక్టోబరు 16 : ఆరిలోవ ప్రాంతంలో గల బీఆర్టీఎస్ రోడ్డులో పలు చెట్లను నరికి వేస్తున్నారు. బీఆర్టీఎస్ రోడ్డు వేసినపుడు డివైడర్‌పై అందం, ఆహ్లాదం పెంపొందించేందుకు మొక్కలు నాటి పెంచారు. ఈ మొక్కలు పెద్దవై పూలు కూడా పూచేవి. దీంతో ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ ప్రాంతం ఎంతో ఆకర్షణీయంగా కనిపించేది.పాదచారులు, వాహనచోదకులు ఈ ప్రాంతం నుంచి వెళుతూ చక్కని వాతావరణాన్ని ఆస్వాదించేవారు. అలాగే హనుమంతవాక జంక్షన్ నుంచి ఆడవివరం జంక్షను వరకు గల బీఆర్టీఎస్ రోడ్డు మధ్యలో మొక్కలను నాటి చెట్లుగా తయారు చేశారు. ఇటు వైపు వెళ్లే వారంతా చెట్ల నీడ, పచ్చదనం చూసి పరవశించేవారు.

తాజాగా ఏమైందో తెలియదు కాని ఈ పూల మొక్కలు, చెట్ల కొమ్మలను నరికి వేశారు. దీంతో ఈ ప్రాంతమంతా బోసి పోయింది. ఇన్నాళ్లూ చెట్లను చూసి, చక్కని వాతావరణాన్ని పరికించి ముచ్చట పడిన వారంతా చెట్లను నరికివేయడం చూసి తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. అసలు ఈ పూల మొక్కలు, చెట్లను ఎందుకు నరికి వేశారో అర్థం కావడం లేదని, ఇది అమానుషమని వారంతా ఆక్షేపిస్తున్నారు. పచ్చదనం పెంచండి.. పర్యావరణాన్ని పరిరక్షించండి అంటూ ప్రకటనలు గుప్పించే అధికారులు, ప్రజా ప్రతినిధులు మరెందుకు ఇలాంటి బాధాకర నిర్ణయాలు తీసుకుంటున్నారో అర్థం కావడం లేదని వ్యాఖ్యానిస్తున్నారు.

తెలుగు సాహిత్యానికి విశ్వనాథ సేవలు అమోఘం

- డాక్టర్ అతుకూరు వెంకటేశ్వర్లు



సమావేశంలో ప్రసంగిస్తున్న వెంకటేశ్వర్లు

సీతంపేట, అక్టోబరు 16, (ఆంధ్రజ్యోతి) : తెలుగు సాహిత్యాన్ని జాతీయ భావాలతో సుసంపన్నం చేసిన మహాకవి విశ్వనాథ సత్యనారాయణ అని డాక్టర్ అతుకూరు వెంకటేశ్వర్లు (యోగి) పేర్కొన్నారు. బుధవారం సీతంపేట రాజేంద్రనగర్‌లో గల ప్రిజమ్ కళాశాలలో సహృదయ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో 'విశ్వనాథ నవలలు, యోగశాస్త్ర అంశాలు' అంశంపై ప్రసంగ కార్యక్రమాన్ని నిర్వహించారు. సహృదయ సాహితీ సంస్థ అధ్యక్షులు శేఖరమంత్రి ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా విచ్చేసిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలుగు సాహిత్యానికి విశ్వనాథ సత్యనారాయణ సేవలు అనన్యమైనదన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కేజీ వేణు, డాక్టర్ డీవీ సూర్యారావు, ద్విభాష్యం రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్ నియామకమెన్నడో?

... 5వ పేజీ తరువాయి

తీసుకోవడంలో కొన్ని ఇబ్బందులు ఎదురవుతాయనే భావనను పలువురు వ్యక్తం చేస్తున్నారు.

అందువల్ల వీలైనంత త్వరగా చైర్మన్ ఎంపిక ప్రక్రియను పూర్తిచేస్తే వర్సిటీకి మేలు జరుగుతుందని పలువురు చెబుతున్నారు. గవర్నింగ్ బాడీలో చైర్మన్‌తో కలిపి 11 మంది ఉంటారు. పది మంది సభ్యుల్లో ముగ్గురు విద్యావేత్తలు, పారిశ్రామిక రంగానికి చెందినవారు ముగ్గురు, మెంటార్ ఇనిస్టిట్యూట్ అయిన ఖరగ్‌పూర్ ఐఐటీ నుంచి ఒక ప్రొఫెసర్, ఏయూ నుంచి ఒకరు, పెట్రో వర్సిటీ డైరెక్టర్, రిజిస్ట్రార్ సభ్యులుగా ఉంటారు. ఏదైనా నిర్ణయం తీసుకోవాలంటే ముందుగా గవర్నింగ్ బాడీ అనుమతి ఉండాలి. రెండేళ్లుగా గవర్నింగ్ బాడీకి పూర్తిస్థాయి చైర్మన్ లేకపోవడంతో నిర్ణయాలు తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నట్టు తెలుస్తోంది.

రూ.1.15 కోట్ల పల్లాడియం మెటల్ చోరీ

అనకాపల్లి రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : 'సొంత ఇంటికే కన్నం పెట్టిన' చందంగా... ఉద్యోగం చేస్తున్న కంపెనీలోనే విలువైన లోహాన్ని చోరీ చేశారు. దీని విలువ కోటి రూపాయలకు పైగా వుంటుంది. కంపెనీ యాజమాన్యం చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ దీపిక బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఆమె చెప్పిన సమాచారం మేరకు...

పరవాడ ఫార్మాసిటీలోని రవీంద్ర హెరాయిస్ ప్రైవేట్ కంపెనీలో ఉత్ప్రేరకాన్ని రిసైకిలింగ్ చేసి పల్లాడియం మెటల్‌ను డ్రయ్యర్‌లో ఉంచి ఆర బెడతారన్నారు. ఇది అత్యంత ఖరీదైనది. కాగా ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన చింతకాయల రాజు పెయింటర్‌గా, చింతకాయల మురళి ప్రొడక్షన్ బ్లాక్‌లో హెల్పర్‌గా, అక్కిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన కనుమూరి రామచంద్రరాజు అసిస్టెంట్ ప్రొడక్షన్ మేనేజర్‌గా, విజయనగరం జిల్లాకు చెందిన ముదునూరి వినీత్‌వర్మ ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అత్యంత విలువైన పల్లాడియం లోహాన్ని చోరీ చేసి డబ్బులు సంపాదించాలని భావించారు. ఈ నెల 5వ తేదీన లంకెలపాలెంలోని ఒక హోటల్లో వీరు సమావేశమై పల్లాడియం లోహం చోరీకి పథక రచన చేశారు. వినీత్‌వర్మ, రామచంద్రరాజు అదే రోజు పరిశ్రమకు వెళ్లి సీసీ కెమెరాలను ఆపివేశారు. డ్రయ్యర్ లాక్‌కు సంబంధించి మారుతాళం చెవిని అప్పటికే తయారు చేయించి సిద్ధం చేసుకున్నారు. 9వ తేదీ రాత్రి చింతకాయల రాజు, చింతకాయల మురళి ప్లాంట్ గోడ దూకి లోపలికి వెళ్లారు. మారుతాళం చెవితో డ్రయ్యర్‌ను తెరిచి 4.11 కిలోల పల్లాడియం మెటల్‌ను చోరీ చేశారు. అనంతరం దీనిని చింతకాయల రాజు ఇంటి వద్ద భద్రపరిచారు. పదో తేదీ ఉదయం డ్రయ్యర్‌ను పరిశీలించిన కంపెనీ ప్రతినిధి వరదరాజన్.. 4.11 కేజీల పల్లాడియం మెటల్ లేనట్టు గుర్తించారు. దీని విలువ రూ.1.15 కోట్లు వుంటుందని అంచనా. లోహం చోరీకి గురైనట్టు నిర్ధారించుకుని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. వరదరాజన్ 12వ తేదీన పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేప ట్టారు. కంపెనీలో పనిచేస్తున్న అనుమానిత వ్యక్తులపై నిఘా పెట్టారు. చింతకాయల రాజు, చింతకాయల మురళి, కనుమూరి రామచంద్రరాజు ముదునూరి వినీత్‌వర్మలు కంపెనీలో చోరీ చేసిన పల్లాడియం మెటల్‌ను విక్రయించేందుకు బుధవారం పరవాడ మండలం తానాం శ్మశానవాటిక వద్ద వుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విచారించగా పల్లాడియం మెటల్‌ను చోరీ చేసినట్టు అంగీకరించారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. చోరీ కేసును నాలుగు రోజుల్లో ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన సిబ్బందికి ఎస్పీ దీపిక ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో పరవాడ డీఎస్పీ కె.సత్యనారాయణ, సీఐ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

ప్రాణాలు తీస్తున్న బెట్టింగ్

... 5వ పేజీ తరువాయి

స్థాయి మ్యాచ్‌లు ఏవీ జరగకపోతే క్లబ్ స్థాయిలో జరిగే మ్యాచ్‌లపైనా కూడా బెట్టింగ్ కడుతుంటారు. ఆన్‌లైన్‌లో బెట్టింగ్ వేస్తున్న వారిలో విద్యార్థులు, ఉద్యోగాలు, వ్యాపారులు ఎక్కువగా ఉంటున్నారు. సరదాగా మొదలెట్టి తర్వాత బెట్టింగ్‌కు బానిసలుగా మారిపోతున్నారు.

బుకీల మోసం

బెట్టింగ్‌లో ఓడిపోయినవారు మొత్తం డబ్బులు పోగొట్టుకుంటే బుకీలు మాత్రం కమీషన్ రూపంలో భారీగా ఆదాయం సమకూరుతోంది. బెట్టింగ్ ఎంతకాసినా సరే గెలిచిన వారి నుంచి పది శాతం కమీషన్‌గా మినహాయించుకుని మిగిలిన మొత్తాన్ని మాత్రమే గెలిచిన వారి ఖాతాకు బుకీలు జమ చేస్తారు. ఒక్కోసారి మ్యాచ్ జరుగుతున్నప్పుడు ఏదైనా జట్టు గెలుపు, ఓటములపై స్పష్టత వచ్చినప్పుడు బుకీలు తమకు బాగా డబ్బులు వస్తాయని భావిస్తే మ్యాచ్ అయిపోయేంత వరకూ యాప్‌ను హోల్డ్‌లో పెట్టేస్తుంటారు. బెట్టింగ్ కాసిన వారిలో ఎవరైనా ఎదుటి జట్టు వైపు బెట్టింగ్ మార్చేసుకుంటే తమకు రావాల్సిన మొత్తం కోల్పోవాల్సి ఉంటుందనే భావనతో అలా చేస్తారు. దీనివల్ల బెట్టింగ్ కాసేవాళ్లు భారీగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

ఆత్మహత్యలకు పాల్పడుతున్న బాధితులు

విద్యార్థులు, యువత సులభంగా డబ్బులు వస్తాయనే ఆశతో ఆన్‌లైన్‌లో యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకుని బెట్టింగ్ కాస్తున్నారు. చివరకు డబ్బులు పోగొట్టుకుని అప్పుల ఊబిలోకూరుకుపోతున్నారు. ఇంటిదగ్గర డబ్బులు అడిగితే, ఎందుకు అంత మొత్తం అవసరమైందని అడుగుతారనే భయంతో స్నేహితుల వద్ద అప్పులుచేయడం, ఆన్‌లైన్ లోన్ యాప్‌ల నుంచి రుణం తీసుకోవడం చేస్తున్నారు. లోన్‌యాప్‌ల నుంచి రుణాలుతీసుకుంటే తక్కువ వ్యవధిలోనే రెట్టింపు మొత్తాన్ని వాయిదాల రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ చెల్లించలేకపోతే వారిఫొటోలు, వీడియోలను న్యూడ్‌గా మార్చి బాధితుల ఫోన్‌లోని కాంటాక్ట్ నంబర్లన్నింటికీ పంపిస్తామని బెదిరిస్తుంటారు. దీంతో ఆందోళనకు గురైన బాధితులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

కేసులు నమోదుచేయని పోలీసులు

బెట్టింగ్ కారణంగా ఎంతోమంది డబ్బులు పోగొట్టుకుంటున్నప్పటికీ పోలీసులు దీనిపై కేసులు నమోదు చేసేందుకు విముఖత చూపుతున్నారు. బెట్టింగ్‌ను రాష్ట్రంలో నిషేధించినప్పటికీ కొంతమందిఆన్‌లైన్ ప్లాట్‌ఫారాలపై గుట్టుగా బెట్టింగ్ కాసి నష్టపోతున్నారని, అలాంటివారికి న్యాయం చేసే ప్రయత్నం చేస్తే బెట్టింగ్ జాడ్యం మరింత పెరిగే ప్రమాదం ఉందని పోలీసులు చెబుతున్నారు.అందువల్లే ప్రతిరోజూఎవరో ఒకరు ఫిర్యాదు చేసేందుకు వచ్చినా సరే తాము చేయగలిగిందేమీ లేదని చెప్పి వెనక్కి పంపేస్తున్నారు. దీంతో కేసులు నమోదుకావడం లేదు.

రోడ్డు ప్రమాదంలో మిత్రులు దుర్మరణం

- కశింకోట వద్ద ప్రమాదం
- విశాఖ నుంచి బైక్‌పై వస్తుండగా ఘటన


బర్నికుల రాజేశ్, ప్రతాప్ (ఫైల్‌ఫొటోలు)

కశింకోట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మిత్రులు ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన కశింకోట వద్ద మంగళవారం అర్ధరాత్రి జరిగింది. సీఐ అల్లు స్వామినాయుడు తెలిపిన వివరాలిలా వున్నాయి. నక్కపల్లి మండలం నెల్లిపూడి గ్రామానికి చెందిన బర్నికుల రాజేశ్ (24), గునిపూడికి చెందిన కురందాసు ప్రతాప్ (26) స్నేహితులు. వీరు విశాఖపట్నంలో కారు డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. మంగళవారం రాత్రి విశాఖ నుంచి ద్విచక్రవాహనంపై నక్కపల్లి మండలానికి బయలుదేరారు. అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో కశింకోట వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. దీంతో ప్రతాప్, రాజేశ్ అక్కడికక్కడే మృతిచెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి కి తరలించారు. చేతికి అందివచ్చిన బిడ్డలు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

మద్యం లొల్లి

... 5వ పేజీ తరువాయి

రోడ్డులో ఆదిత్య గెస్ట్‌హౌస్ పక్కన పాత మద్యం దుకాణం పక్కనే కొత్త మద్యం దుకాణం ఏర్పాటుచేశారు. అక్కడ ప్రతి బాటిల్‌పై ఎమ్మార్పీ కంటే రూ.20 ఎక్కువ వసూలు చేశారు. దీనిపై మందుబాబులు ఆగ్రహం వ్యక్తంచేశారు. తక్కువ రేటు మద్యం అందుబాటులోకి తేకుండా ఎమ్మార్పీపై అదనపు మొత్తం వసూలు చేయడమేమిటని ప్రశ్నించారు.

అయితే తమ యజమాని అలాగే విక్రయించాలని చెప్పారని, నచ్చితే కొనాలని, లేదంటే వెళ్లిపోవాలని అక్కడి సిబ్బంది చెప్పడంతో మందుబాబులు ఎదురు తిరిగారు. ఎమ్మార్పీపై రూ.20 అధికం అంటూ బోర్డు పెట్టి, మద్యం విక్రయించాలని, అప్పటివరకూ అమ్మడానికి వీల్లేదన్నారు. దీంతో దుకాణ నిర్వాహకులు చేసేది లేక షట్టర్ దించేసి అమ్మకాలు నిలిపివేశారు.

మరికొన్ని ప్రాంతాల్లోనూ మద్యం అధిక ధరలకు అమ్మినట్టు తెలిసింది. ప్రభుత్వం పాత సరకునే సరఫరా చేయడం వల్ల అదే ధరలకు అమ్మాల్సి వస్తోందని, కొత్త స్టాకు వస్తే ధరలు తగ్గుతాయని కొందరు చెబుతున్నారు. అయితే ఇప్పటివరకూ అనుభవాలను దృష్టిలో ఉంచుకొని మందుబాబులు వారి మాటల్ని విశ్వసించడం లేదు. తమకు నమ్మకం లేదని, రేటు తగ్గిస్తామని చెప్పి, ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడమేమిటని ప్రశ్నిస్తున్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఎండాడ, అక్టోబరు 16, (ఆంధ్రజ్యోతి) : ఎండాడ ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-3 ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎండాడ, రాజీవ్‌నగర్, వరహాగిరినగర్, ముబారక్ కాలనీ, సాగర్‌నగర్, సుభాష్‌నగర్, దసపల్లా లేఅవుట్, ఐటీ పార్కు, ఎస్ఎస్ రోడ్డు, రామానాయుడు స్టూడియో, తిమ్మాపురం, హిల్ నెంబర్ 1,2,3, రుషికొండ, చలపతి నగర్, దయాల్‌నగర్, ఎస్సీ ఎస్టీ కాలనీ, విశాలాక్షినగర్, పోలీస్ క్వార్టర్స్ఏసీబీ ఆఫీస్ రోడ్డు, రెవెన్యూ పార్కు ప్రాంతాలకు సరఫరా ఉండదని చెప్పారు.

సింహాచలం పరిధిలో...

సింహాచలం : పైనాపిల్ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. పైనాపిల్ కాలనీ, ముడసర్లోవ, శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం, ఎస్ఎస్ఎస్ నగర్, కామాక్షీనగర్, సీబీడీ ఆఫీసు, జేఎన్ఎన్‌యూఆర్ఎం బ్లాక్, శ్రీకాంత్‌నగర్ లేఅవుట్, కనకమహాలక్ష్మీ నగర్, రాజీవ్‌నగర్, పోలీస్ స్టేషన్, టీబీసీ పాయింట్, ఆరిలోవ లాస్ట్ బస్టాప్, పాండురంగాపురం, నెహ్రూనగర్, దుర్గాబజార్, లక్ష్మీనగర్, శివాజీనగర్ ప్రాంతాలకు సరఫరా ఉండదు.

నేడు సినీ దర్శకుడు ఆదిత్యతో ఇష్టాగోష్ఠి

భీమునిపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చిన్నబజారులో ఉన్న ఫంక్షన్ హాల్‌లో కళాసాహితి ఆధ్వర్యంలో సినీ దర్శకుడు ఆదిత్యతో గురువారం ఇష్టాగోష్ఠి నిర్వహించనున్నట్టు ఆ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు పి. రాజేంద్రప్రసాద్ వర్మ, సన్యాసిరాజు తెలిపారు. బుధవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.

అప్పన్నకు సహస్రనామ తులసీ దళార్చన



సింహాచలం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా సహస్రనామ తులసీ దళార్చన గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవ, ప్రభాతారాధనలు ముగిసిన తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ సహస్రనామావళి పఠిస్తూ తులసీ దళాలతో అర్చన చేశారు. స్వామివారికి మంత్ర పుష్పం కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

సినిమా గైడ్

● **వేట్టయాన్ :** సంగం, రమాదేవి, వెంకటేశ్వర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ లక్ష్మి (గాజువాక), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాత (తగరపువలస)

● **విశ్వం :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం),మోహిని కాంప్లెక్స్ లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

● **జనక అయితే గనక :** శారద, కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)

● **మా నాన్న సూపర్‌హీరో :** గోకుల్, మౌర్య (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)

● **శ్వాగ్ :** శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్-2 (పెందుర్తి), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)

● **దేవర :** మెలోడి, జగదాంబ, శరత్, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 49, టమాటా 50, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 28, పచ్చిమిర్చి 56, కాకరకాయలు 32, బీరకాయలు 40, ఆనపకాయలు 28, కాలీఫ్లవర్ 44, క్యాబేజి 32, క్యారెట్ 56 దొండకాయలు 36, బంగాళదుంపలు 30, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 82, అల్లం (పాతది) 100, బరబటి 44, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 85, గోరుచిక్కుడు 30, దోసకాయ 32, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 26, బీన్స్ (పెన్సిల్) 130, పొటల్స్ 66, కీరదోస 30, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40, చిలగడదుంపలు 32, కంద 62, దేముడు చిక్కుడు 75, కొండఉసిరి 85, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాల కూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 30, మామిడి అల్లం 74, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	120
ఫారం ధర	149
విత్ స్కిన్	250
స్కిన్‌లెస్	260



శిథిలావస్థలో ఉన్న సబ్ ట్రెజరీ కార్యాలయం



పెచ్చులూడుతున్న శ్లాబ్



నూతన భవన నిర్మాణానికి కేటాయించిన స్థలం

అనుక్షణం...భయం భయం..

» శిథిలావస్థలో సబ్ ట్రెజరీ కార్యాలయం
» పెచ్చులూడుతున్న శ్లాబ్
» బిక్కుబిక్కుమంటూ సిబ్బంది విధుల నిర్వహణ
» అర్ధాంతరంగా నిలిచిన కొత్త భవనం నిర్మాణం

భీమునిపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సబ్ ట్రెజరీ కార్యాలయం భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. గోడలు బీటలు వారి, శ్లాబ్ పెచ్చులూడి పడుతుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా వర్షం పడితే ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని విధులు నిర్వర్తిస్తున్నారు. వందేళ్ల క్రితం నిర్మించిన ఈ భవనం పూర్తిగా శిథిలమైందని చాలాకాలం క్రితమే ఇంజనీరింగ్ అధికారులు నిర్ధారించారు. కానీ ప్రత్యామ్నాయం లేక కార్యాలయాన్ని అదే భవనంలో కొనసాగిస్తున్నారు. 1853లో ఒకే ఆవరణలో తహసీల్దార్, సబ్ ట్రెజరీ, సబ్ జైలును నిర్మించారు.వీటిలో సబ్‌జైలు భవనం పూర్తిగా శిథిలం కావడంతో ఇరవై ఏళ్ల క్రితం మూసివేసి ఖైదీలను, సిబ్బందిని అడవివరం సెంట్రల్ జైలుకు తరలించారు. రెండేళ్ల క్రితం తహసీల్దార్ కార్యాలయాన్ని కూడా పక్కనున్న ఆర్డీవో కార్యాలయం పైఅంతస్థులోకి తాత్కాలికంగా మార్చుచేశారు. కానీ సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని మాత్రం శిథిల భవనంలోనే నిర్వహిస్తున్నారు. భవనం పూర్తిగా శిథిలం కావడంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కార్యాలయం గోడలు నానిపోయి నీరు కారింది. అలాగే ముందు భాగంలో పొదలు పెరిగిపోయాయి.కార్యాలయాన్ని పాత బస్టాండ్ ఎదురుగా వున్న మూసివేసిన మీసేవా భవనాన్ని పునర్నిర్మించి అక్కడికి తరలించాలని భావించారు. ఈమేరకు కొద్దిగా మార్పులు కూడా చేశారు. అయితే గతంలో మీసేవా కేంద్రంలో చోరీలు జరగడం వల్ల అక్కడ అంత సురక్షితం కాదని అధికారులు ఆ ఆలోచన విరమించుకున్నారు.

మూడు మండలాలకు ఇదొక్కటే

ఈ కార్యాలయం పరిధిలో భీమిలి అర్బన్, రూరల్, పద్మనాభం, ఆనందపురం మండలాలు ఉన్నాయి. కార్యాలయంలో అయిదుగురు సిబ్బంది పని చేస్తున్నారు. వీరిలో డ్రాయింగ్ అండ్ డిస్బర్స్‌మెంట్ ఆఫీసర్లు కూడా ఉన్నారు. సుమారు వెయ్యి మంది వరకూ ప్రభుత్వ పింఛనుదారులు వున్నారు. భవనం వరండాలో తరచూ శ్లాబ్ పెచ్చులూడి పడుతోంది. దీంతో వరండాలో నిరీక్షించే పింఛన్‌దారులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు.

సగంలో నిలిచిన పనులు

స్థానిక ప్రభుత్వాస్పత్రి ఎదురుగా గతంలో తహసీల్దార్ కార్యాలయానికి అనుబంధంగా ఉన్న విలేజీ చావడి ప్రదేశాన్ని సబ్ ట్రెజరీ కార్యాలయం నూతన భవనం నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించింది.రూ.75 లక్షలు నిధులు కూడా విడుదల చేసి, టెండర్లు పిలిచారు. పనులను రాష్ట్ర ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌కి అప్పగించారు. ఎన్నికలకు ముందు బోరు తీశారు. ఈలోగా సార్వత్రిక ఎన్నికలు జరిగి కొత్తగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు నిలిపివేశారు.

త్వరలోనే నూతన భవన నిర్మాణం



ఈవిషయమై భీమిలి సబ్ ట్రెజరీ కార్యాలయం అధికారి ధవళ అప్పలరాజు మాట్లాడుతూ భవనం దుస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. ప్రభుత్వం నుంచి అనుమతి రావాల్సి ఉందని, త్వరలోనే నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని తెలిపారు.

విశ్వకర్మ యోజనపై అవగాహన అవసరం



ఆనందపురం : బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా, తదితరులు



కొమ్మాది : సదస్సులో మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

ఎంపీ ఎం. శ్రీభరత్, ఎమ్మెల్యే గంటా

కొమ్మాది, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : సంప్రదాయ కుల వృత్తులు చేస్తున్న వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎం విశ్వకర్మ యోజన కింద ఆర్థిక సహాయం అందిస్తున్నాయని ఎంపీ ఎం. శ్రీభరత్ అన్నారు. బుధవారం పీఎంపాలెంలో అవంతి ఫంక్షన్ హాల్‌లో విశ్వకర్మ యోజనపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. 19 కుల వృత్తులకు ఈ పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక చేయూత నిస్తున్నాయని చెప్పారు. అర్హులైన వారికి ఏడు రోజులు శిక్షణ అందిస్తారని ఆ సమయంలో రూ. 500 లతో పాటు రూ. 15 వేల విలువ చేసే టూల్ కిట్ ఇస్తారని చెప్పారు. అలాగే పథకం కింద 5 శాతం వడ్డీతో మొదట విడత రూ. లక్ష, రెండో విడత రూ. లక్షలు ఇస్తారని తెలిపారు. పథకాన్ని విజయవంతం చేయడానికి అధికారులతో పాటు రాజకీయ నాయకులు సహకరించాలని కోరారు. గత ప్రభుత్వంలో ఎంపీలు కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. కూటమి పాలనలో ఆ పరిస్థితి లేకుండా చూడాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులు, పథకాలు ప్రజలకు ఎంత మేర చేరాయన్న దానిపై దిశ సమావేశం ఉంటుందని, దానికి తాను చైర్మన్ కావడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో యూసీడీ పీఓ దాట్ల లక్ష్మి, డీపీఓ కె. కనక మహాలక్ష్మి, జోన్-2 కమిషనర్ సింహాచలం, జోన్ 2 ఏపీడీ గంగాధర్, 2, 5 7 వార్డుల కార్పొరేటర్లు చిన్నికుమారి, మొల్లి హేమలత, పిళ్లా మంగమ్మ, ఆరో వార్డు టీడీపీ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, గరే గురునాథ్, జనసేన వార్డు అధ్యక్షుడు సంతోష్‌నాయుడు, రెడ్డి సత్యనారాయణ, లొడగల జానకీ రామ్, తదితరులు పాల్గొన్నారు.

చేతి వృత్తులకు పూర్వ వైభవం

ఆనందపురం : చేతి వృత్తులకు పూర్వ వైభవం తీసుకురావడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఆనందపురం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన పీఎం విశ్వకర్మ యోజన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎంత గొప్ప వస్తువు అయినా సరైన మార్కెటింగ్ లేకపోతే తయారీదారుడు నష్టపోతాడని, అటువంటి కీలక బాధ్యతను ప్రభుత్వం తీసుకోవడం ప్రశంస నీయమని చెప్పారు. పథకం గురించి చేతివృత్తుల వారికి తెలియజేసే బాధ్యతను పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు తీసుకుని విజయవంతం చేయాలని కోరారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలతో పాటు పెందుర్తి మండలంలో 10 వేల మంది చేతి వృత్తుల వారు ఉండగా 2 వేల మందిని పథకానికి ఎంపిక చేశారని తెలిపారు. అనంతరం ఆయన విశ్వకర్మ యోజన బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కోరాడ రాజబాబు, రామానాయుడు, ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక, బీఆర్‌బీ నాయుడు, రాజు,తాత్రాజు అప్పారావు, భీమిలి ఎంపీడీఓ హనుమంతరావు, ఈఓఆర్డీ సత్యనారాయణ, పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలు వాయిదా

విశాఖపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా సాగునీటి సంఘాల ఎన్నికలు తాత్కాలికంగా వాయిదా పడ్డాయి. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ మేరకు బుధవారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయాలి. వచ్చే నెల 24 లోగా సాగునీటి సంఘాలు, డిస్ట్రిబ్యూటరీ, ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు పూర్తిచేయాలి. ఎన్నికల నిర్వహణకు జలవనరు శాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. అయితే బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో మూడు రోజులుగా దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తుండడంతో జిల్లా యంత్రాంగాలు వరద సహాయక చర్యలు, ఇతర కార్యకలాపాల్లో నిమగ్నమయ్యారు. దీంతో తదుపరి ఆదేశాలు వచ్చే వరకు నోటిఫికేషన్ విడుదల చేయవద్దని జలవనరులశాఖను ప్రభుత్వం ఆదేశించింది. ఈమేరకు ఎన్నికల ప్రక్రియ నిలిపివేస్తున్నట్టు ఉత్తరకోస్తా చీఫ్ ఇంజనీరు సుగణాకరరావు తెలిపారు.

27 నుంచి పద్మనాభుని పవిత్రోత్సవాలు

పద్మనాభం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని అనంత పద్మనాభుని దేవస్థానంలో ఈనెల 27 నుంచి పవిత్రోత్సవాలు నిర్వహించడానికి ఉత్సవ కమిటీ సమాయత్తమవుతోంది. ఈమేరకు ఆలయ ఈఓ నానాజీబాబు ఆధ్వర్యంలో స్థానిక కుంతీమాధవస్వామి ఆలయంలో కమిటీ సభ్యులు బుధవారం సమావేశమయ్యారు. 27 నుంచి ఈనెల 30 వరకు ఉత్సవాలు నిర్వహించడానికి నిర్ణయించారు. దేవస్థానం తరఫున పవిత్రాలను ఇప్పటికే తమిళనాడు నుంచి తీసుకురావడానికి ఏర్పాట్లు చేశామని ఈఓ నానాజీబాబు చెప్పారు. కమిటీ సభ్యులు ఇతర ఏర్పాట్లు చేయడానికి నిర్ణయించారు. దాతల సహాయ సహకారాలతో ప్రతి ఏటాలాగే ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని తీర్మానించారు. అనంతుని ఆలయ పునర్నిర్మాణం పూర్తి కానున్న నేపథ్యంలో ఆలయ పునఃప్రారంభం, స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించాలని నిర్ణయించారు. అలాగే నవంబరులో జరిగే దీపోత్సవం తదితర వాటికి సింహాచలం దేవస్థానం సహకారాన్ని కోరాలని, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సహాయం అభ్యర్థించాలని సభ్యులు తీర్మానించారు.సమావేశంలో ఎంపీపీ రాంబాబు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కె. నగేష్‌కుమార్, తెలుగు యువత అధ్యక్షుడు సత్యనారాయణ, జనసేన మండల అధ్యక్షుడు కె. రామస్వామినాయుడు, ప్రధాన కార్యదర్శి సారధి, బీజేపీ యువమోర్చా మండల అధ్యక్షుడు మహేశ్, కమిటీ సభ్యులు ఎర్నాయుడు, సన్యాసిరావు, నారాయణరావు, రమణ, నరసింగరావు, రాము, పైడిరాజు, అప్పలనాయుడు, సన్నిబాబు, అర్చకుడు సీతారామాంజనేయస్వామి పాల్గొన్నారు.

సంగివలస పార్కులో సౌకర్యాలు కరువు



తుప్పు పట్టి రంధ్రం పడిన జారుడు బల్ల

తగరపువలస, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస జాతీయ రహదారిని ఆనుకుని సంగివలస మూడుగుళ్ల అమ్మవారి దేవాలయం పక్కన ఏర్పాటు చేసిన పిల్లల పార్కులో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. పార్కులో పిల్లలు ఆడుకోవడానికి ఏర్పాటు చేసిన అనేక ఆట వస్తువులు తుప్పు పట్టి పాడయ్యాయి. చాలా ఏళ్లు నిరుపయోగంగా ఉన్న ఇక్కడి చెరువును డీవీస్ అధికారులు అభివృద్ధి చేశారు. చెరువును లోతు చేయడంతో పాటు ఇతర అభివృద్ధి పనులు, రూ. 2 కోట్లతో పిల్లల పార్కు ఏర్పాటు చేసి, ఆట వస్తువులు ఏర్పాటు చేశారు. కొన్నేళ్లు పాటు ఉదయం, సాయంత్రం పిల్లలు, పెద్దలు ఇక్కడికి వచ్చి సేదతీరేవారు. తరువాత పార్కు నిర్వహణను ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆట వస్తువులు తుప్పు పట్టి పాడయ్యాయి. కుర్చీలు, బెంచీలు విరిగిపోయాయి. దీనివల్ల పిల్లలు కొన్ని సార్లు గాయపడుతున్నారు. పాలకులు, అధికారులు తక్షణమే స్పందించి పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

విద్యుదాఘాతంలో యువకుడి మృతి

ఎండాడ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : కొమ్మాదిలోని ఓ ఫంక్షన్‌లో విద్యుత్ లైట్ల అలంకరణ చేస్తుండగా యువకుడు ప్రమాదానికి గురై మృతి చెందాడు. పీఎంపాలెం పోలీసులు తెలి పిన వివరాలు ప్రకారం...కొమ్మాదిలో ఓ వివాహానికి విద్యుత్ దీపాలంకరణ కోసం నొడగల లక్ష్మణ్ ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈమేరకు బుధవారం సిబ్బందితో కలిసి లైటింగ్ అమరుస్తుండగా బెవర సాయి కుమార్ (22) విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సాయికుమార్ అదే ప్రాంతంలోని రేవళ్లపాలెంలోని దేవీపట్నంలో ఉంటున్నాడు. అతనికి తల్లి సరస్వతి, సోదరుడు ఉన్నారు. సాయి మృతి చెందడంతో స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి విరాళం

సింహాచలం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి గాజువాక ప్రాంతానికి చెందిన గణేశ్ ఎంటర్‌ప్రైజెస్ అధినేత జి. వెంకట నాయుడు రూ.2,08,116లను విరాళంగా సమర్పించారు. విరాళాన్ని చెక్ రూపంలో ఆలయ పీఆర్ఓ కార్యాలయ సిబ్బందికి బుధవారం ఆయన అందజేశారు.

200 మంది రక్తదానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

సాగర్‌నగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో రోటరాక్ట్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. 200 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఎన్‌టీఆర్ బ్లడ్ బ్యాంక్, లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది దాతల నుంచి రక్తాన్ని సేకరించారు. శిబిరాన్ని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విద్యార్థి విభాగం డీన్ కె. బాలాకుమార్, రొటేరియన్ డాక్టర్ స్వాతి చిక్కాల ప్రారంభించగా రోటరాక్ట్ క్లబ్ ప్రెసిడెంట్ కె. జశ్వంత్, క్లబ్ వలంటీర్లు పాల్గొన్నారు.

అల్లకల్లోలంగా సముద్రం

సాగర్‌నగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) :బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడడంతో సాగర్‌నగర్, రుషికొండ తీర ప్రాంతాల్లో సముద్రం అల్లకల్లోలంగా ఉంది. తీరంలో భీకరమైన గాలులు వీయడంతో పాటు కెరటాలు పెద్ద ఎత్తున ఎగసిపడుతున్నాయి. కాగా బుధవారం సాయంత్రం ఆయా ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది.వర్షంతో పాటు ఈదురుగాలులు, ఉరుములు మెరుపులు హడలెత్తించాయి. రుషికొండ బీచ్ రోడ్డు ఐటీ హబ్ జంక్షన్ కూడలిలో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు.



కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు

'డైట్'లో ప్రపంచ ఆహార దినోత్సవం

భీమునిపట్నం, అక్టోబరు 16 : ప్రపంచంలో ఆహార కొరత వల్ల అనేక మంది మరణిస్తున్నారని, ఆహారాన్ని ఎవరూ వృథా చేయరాదని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. జ్యోతికుమారి అన్నారు. బుధవారం ఆ కళాశాలలో ప్రపంచ ఆహార దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆహార కొరత, ఆహార భద్రత గురించి ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్న ఉద్దేశంతో ఏటా అక్టోబరు 16న ప్రపంచ ఆహార దినోత్సవాన్ని ఐక్యరాజ్యసమితి నిర్వహిస్తుందన్నారు. 2024 ప్రపంచ ఆకలి సూచీలో మన దేశం 105వ స్థానంలో ఉందని చెప్పారు. భారత్‌లో కూడా ఆహార కొరత, పోషకాహార లోపం ఉన్నాయని తెలిపారు. ఆహారాన్ని వృథా చేయడం అంటే పండించే రైతును, నేలను అవమానించినట్లేనని భావించాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ఎం. మాణిక్యంనాయుడు మాట్లాడుతూ ఈ సంవత్సరం మెరుగైన జీవితం భవిష్యత్తు కోసం ఆహార హక్కు అన్న అంశంతో ఆహార దినోత్సవం నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐశ్వర్య వెంకటేశ్వరాలయంలో వ్రతాలు



సామూహిక వ్రతాలు చేస్తున్న మహిళలు

భీమునిపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఐశ్వర్య వెంకటేశ్వరాలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా భక్తులు బుధవారం సామూహిక వ్రతాలు చేపట్టారు. అనంతరం తీర్థ, ప్రసాద గోష్ఠి, అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీలు కలిగొట్ల సూర్యనారాయణమూర్తి, కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ఆనందపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రూ. 1.65 కోట్ల ఉపాధి నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం శంకుస్థాపన చేశారు. గంభీరం పంచాయతీ ఎస్ఆర్ కళాశాల నుంచి ఐఐఎం వరకు రూ. 30 లక్షలతో బీటీ రోడ్డు, శ్రీలక్ష్మి బ్రిక్స్ ఇండస్ట్రీ నుంచి ఎస్ఆర్ కాలేజీ వరకు రూ. 40 లక్షలతో సీసీ రోడ్డు, వేములవలస సచివాలయం నుంచి ఐఎంఎఫ్ఎల్ లిక్కర్ డిపో వరకు రూ. 40 లక్షలతో సీసీ రోడ్డు, బోని రోడ్డు నుంచి ఎల్‌వీపాలెం మీదుగా ఆనందపురం మండల పరిషత్ కార్యాలయం వరకు రూ. 40 లక్షలతో సీసీ రోడ్డు, పైడితల్లమ్మ ఆలయం నుంచి తర్లువాడ వరకు రూ. 15 లక్షతో బీటీ రోడ్డు నిర్మించనున్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఈ పనులకు ఎమ్మెల్యే గంటా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కోరాడ రాజబాబు, రామానాయుడు, గంభీరం సర్పంచ్ ధనలక్ష్మి, ఉప సర్పంచ్ నవీన్, సూర్యనారాయణ, బంగారునాయుడు, అప్పలరాజు, బీఆర్‌బీ నాయుడు, తాత్రాజు అప్పారావు, చంద్రకుమారి పాల్గొన్నారు.

పొట్నూరులో శిథిలావస్థలో కల్వర్టు



శిథిలావస్థలో ఉన్న కల్వర్టు

పద్మనాభం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొట్నూరు గ్రామానికి వెళ్లే రోడ్డులో ఉన్న కల్వర్టు పూర్తిగా శిథిలం కావడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెడ్డిపల్లి నుంచి ఈ గ్రామా నికి వెళ్లే రోడ్డులో ఊరు ముఖద్వారం వద్ద ఈ కల్వర్టు ఉంది. పదేళ్ల క్రితం నిర్మించిన ఈ కల్వర్టు పూర్తిగా శిథి లమై ఒకవైపు కుంగిపోగా, మరో భాగం విరిగిపోయింది. పై భాగం కూడా గోతులు పడి, బీటలు వారి ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా గెడ్డలో పడే ప్రమాదం ఉంది. పైపులు కూడా పూడికపోవడంతో వర్షా కాలంలో నీరు దీనిపై నుంచి ప్రవహించడంతో రాకపోకలకు విఘాతం కలుగుతోంది. గతంలో ఈ ప్రవాహంలో పలువురు కొట్టుకుపోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. పాలకులు, అధికారులు తక్షణమే స్పందించి నూతన కల్వర్టు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నియోజకవర్గంలో 32 మద్యం దుకాణాలు

భీమునిపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గానికి మొత్తం 32 మద్యం దుకాణాలు మంజూరయ్యాయి. వీటిలో భీమిలి రూరల్ మండలంలో 4, ఆనందపురంలో 8, పద్మనాభంలో 7 దుకాణాలు కాగా జీవీఎంసీ పరిధిలో వున్న వార్డుల్లో 13 దుకాణాలు ఉన్నాయి. జీవీఎంసీ పరిధిలోని 13 దుకాణాలకు గాను 9 బుధవారం ప్రారంభమయ్యాయని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. పెద్ద బజారులో 2, చిన్నబజారులో 3, మంగమారిపేటలో 2, తిమ్మాపురంలో 1, నమ్మివానిపేటలో 1 దుకాణం ప్రారంభమైంది. చిన్నబజారులో ఒక వైన్ షాప్‌ను కంటైనర్‌లో ఏర్పాటు చేశారు.

'జూట్‌మిల్లు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

తగరపువలస, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జూట్‌మిల్లు కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చొరవ తీసుకోవాలని కాంగ్రెస్ కార్మిక సంఘం నాయకులు కోరారు. బుధవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. కార్మికుల సమస్యను ఎమ్మెల్యే గంటాకు చాలాసార్లు తెలియజేశామని కానీ ఇంతవరకు స్పందించలేదని ఆ సంఘం నాయకులు కైలాస్‌రెడ్డి, అప్పలరెడ్డి తెలిపారు. కార్మికులకు పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ బకాయిలు, ఇతర సమస్యలను యాజమాన్యం పరిష్కరించేలా ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలన్నారు.

18 మద్యం బాటిళ్లు స్వాధీనం

ఎండాడ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ మద్యం దుకాణాల్లో బాటిళ్లు కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్న మహిళపై పీఎంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం.. మారికవలసకు చెందిన గొర్లి చిన్న ఇంట్లో 18 మద్యం బాటిళ్లు ఉన్నట్టు సమాచారం రావడంతో పోలీ సులు బుధవారం దాడి చేసి పట్టుకున్నారు. మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

అయ్యప్ప పీఠం నిర్మాణానికి విరాళం

ఆనందపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గిడిజాల పంచాయతీ దిబ్బడిపాలెంలో అయ్యప్పస్వామి సేవా పీఠం నిర్మాణా నికి మహాలక్ష్మి కల్చర్ అసోసియేషన్ అధినేత ఘట్టంనేని సుభాష్ చంద్రబోష్ రూ. 2 లక్షల విరాళం అందజేశారు. మొత్తాన్ని బుధవారం ఆయన కమిటీ సభ్యులకు ఇచ్చారు.

అప్రమత్తతే రక్ష



ఎసెన్షియా వద్ద అగ్నిమాపక దళం నియంత్రణ చర్యలు (ఫైల్)

ప్రాణాలు హరిస్తున్న ప్రమాదాలు

- ఇటీవల పరిశ్రమల్లో భారీగా సంభవిస్తున్న వైనం
- రోడ్డు, ఇతర ప్రమాదాల్లో గాయపడి కేజీహెచ్‌కు బాధితులు
- ప్రతిరోజూ ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగానికి 200 కేసులు
- జాగ్రత్తలు పాటిస్తేనే ఈ తరహా ప్రమాదాలకు చెక్

నేడు అంతర్జాతీయ ట్రామా డే

విశాఖపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): **కొన్నాళ్లుగా ప్రమాదాల బారినపడి ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య పెరుగుతోంది. రోడ్డు, పారిశ్రామిక, ఇతర ప్రమాదాలు ఏటా వందలాది మందిని బలిగొంటున్నాయని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మనిషి గాయపడడాన్ని ట్రామాగా పేర్కొంటారు. ఈ గాయం దేనివల్ల అయినా సంభవించవచ్చు. రోడ్డు ప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలు, ప్రకృతి విపత్తులు, ఇతర కారణాలు. ట్రామా కేసుల్లో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలుండగా, ఆ తరువాత స్థానంలో పారిశ్రామిక ప్రమాదాలు నిలుస్తున్నాయి. వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించి, ప్రమాదాలను తగ్గించే ఉద్దేశంతో ఏటా అక్టోబరు 17వ తేదీన వరల్డ్ ట్రామా డేగా నిర్వహిస్తున్నారు.**

వరల్డ్ ట్రామా డేను తొలిసారి 2011లో ఢిల్లీలో నిర్వహించారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు దీనిని నిర్దేశించారు. దేశ వ్యాప్తంగా ప్రతిరోజూ 400 మందికి పైగా రోడ్డు ప్రమాదాల్లో ప్రజలు మరణిస్తున్నట్టు అప్పట్లో నిర్ధారణకు వచ్చారు. ఈ సంఖ్య భారీగా పెరిగింది. ఈ ఏడాది పని ప్రదేశాల్లో కలిగే ప్రమాదాల నివారణ, నియంత్రణ పద్ధతులు థీమ్‌తో నిర్వహిస్తున్నారు.



ఎసెన్షియా ఫార్మాలో జరిగిన ప్రమాదంలో ధ్వంసమైన భవనం, మృతిచెందిన ఉద్యోగి (ఫైల్ ఫొటో)

గణనీయంగా ప్రమాదాలు..

ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇటీవల పారిశ్రామిక ప్రమాదాలు పెరుగుతున్నాయి. వీటి వల్ల గత ఐదేళ్లలో సుమారు 120 మంది మృత్యువాత పడ్డారు. పరవాడ శ్రీకర్ ఫార్మాలో 2016లో గ్యాస్ లీకైన ప్రమాదంలో ఒకరు, 2017లో అజికో బయోఫోర్‌లో జరిగిన ప్రమాదంలో ఐదుగురు, 2019లో స్మైలెక్స్ లేబొరేటరీలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు, విజయశ్రీ ఆర్గానిక్స్‌లో జరిగిన ప్రమాదంలో ఒకరు ప్రాణాలను కోల్పోయారు. 2020లో ఫార్మాసిటీలోని విశాఖ సాల్వెంట్స్‌లో జరిగిన ప్రమాదంలో ఇద్దరు, సాయినార్ ఫార్మాలో అదే ఏడాది జరిగిన ప్రమాదంలో ఇద్దరు, రాంకీ పంప్‌హౌస్‌లో 2022లో జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. 2020లో ఎల్‌జీ పాలిమర్స్‌లో జరిగిన ప్రమాదంలో 12 మంది ప్రాణాలను కోల్పోయారు. 2020లో హిందుస్థాన్ షిప్‌యార్డ్‌లో క్రేన్ ప్రమాదం సంభవించి 11 మంది, 2023 జూన్‌లో సాహితీ ఫార్మా కంపెనీలో పేలుడు సంభవించి నలుగురు, 2023లో సింహాద్రి ఎన్‌టీపీసీలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఎసెన్షియా ఫార్మాలో జరిగిన ప్రమాదంలో 17 మంది, సినర్జీస్ కంపెనీలో జరిగిన ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. మొత్తంగా గత పదేళ్లలో సుమారు 150 మంది మృతి చెందగా, వందలాది మంది తీవ్ర గాయాలపాలై ఆస్పత్రుల్లో చికిత్స పొందారు.

నియంత్రణపై దృష్టి సారించాలి..

పారిశ్రామిక ప్రమాదాలను నియంత్రించేందుకు అవకాశం ఉంది. ఆయా పరిశ్రమల్లో ఎప్పటికప్పుడు సేఫ్టీ ఆడిట్ చేయడంతోపాటు ప్రమాదాలకు కారణమయ్యే పరికరాలను నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. కొన్ని రియాక్టర్స్ బ్లాస్ట్ అయ్యే అవకాశం ఉంది. వాటి నిర్వహణ సరిగా లేకపోతే పెను ప్రమాదాలు సంభవిస్తాయి. కాబట్టి, పరిశ్రమల్లోని పరికరాల నిర్వహణపై యాజమాన్యాలు దృష్టి సారించాలి. ఇందుకోసం ప్రత్యేకంగా సేఫ్టీ టీమ్‌ను ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఈ తరహా ప్రమాదాలకు చెక్ చెప్పేందుకు అవకాశం ఉంటుంది.

ఆందోళనకరంగా రోడ్డు ప్రమాదాలు..

ట్రామా కేసుల్లో సుమారు 60 శాతం రోడ్డు ప్రమాదాలే.వీటిలో ఎక్కువ మంది మద్యం మత్తులో ప్రమాదాలకు గురవుతున్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయినిగా భావించే కేజీహెచ్‌లోని ట్రామా విభాగానికి ప్రతిరోజూ 200 వరకు కేసులు వస్తుంటాయి. వీటిలో ఆస్పత్రిలో చేరాల్సినవే 40 వరకు ఉంటున్నాయి. మరో 15 కేసులు తలకు తీవ్రమైన గాయాలైనవే వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. వీటిని నియంత్రించేందుకు మద్యం తాగినప్పుడు వాహనాలను నడకుండా చర్యలు తీసుకోవాలి. మిగిలిన కేసుల్లో చెట్లు మేడ పైనుంచి పడినవి ఉంటున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం ఏటా 50 లక్షల మందికిపైగా రోడ్డు ప్రమాదాల్లో తీవ్ర గాయాలై మృతి చెందుతున్నారు. ప్రతి ఆరు సెకన్లకు ఒక రోడ్డు ప్రమాద మరణం సంభవిస్తోంది. దేశంలో ఏటా పది లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతున్నారు. మరో రెండు కోట్ల మంది ఆస్పత్రుల్లో చేరుతున్నారు.



ఎసెన్షియా ఫార్మాలో ప్రమాదం సంభవించిన సమయంలో ఆందోళనలో స్థానికులు (ఫైల్ ఫొటో)

ప్రమాద నివారణ చర్యలివి..

- మద్యం తాగి వాహనాలు పడకూడదు.
- ట్రాఫిక్ సిగ్నల్స్, నిబంధనలను కచ్చితంగా పాటించాలి.
- హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం తప్పనిసరి.
- సుదూర ప్రాంతాలకు వాహనం నడిపే సందర్భంలో మధ్యమధ్యలో తగినంత విశ్రాంతి అవసరం.

పెరుగుతున్న కేసులు



గతంతో పోలిస్తే ట్రామా కేసులు పెరిగాయి. ప్రతిరోజూ కేజీహెచ్‌లోని క్యాజువాల్టీకి 200 వరకు ట్రామా కేసులు వస్తుంటాయి. వీటిలో తల, ఇతర శరీర భాగాలకు తీవ్రమైన గాయాలైన వారిలో 40 మంది వరకు ఇన్‌పేషెంట్‌గా చేరాల్సి వస్తుంది. ట్రామా విభాగానికి ప్రత్యేకంగా 50 పడకలు అందుబాటులో ఉన్నాయి. పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవించినప్పుడు కేజీహెచ్‌కు భారీగా బాధితులు వస్తుంటారు. ఇటువంటి ప్రమాదాలను కొన్ని నియంత్రణ పద్ధతులు పాటించడం ద్వారా నివారించే వీలుంది. రోడ్డు ప్రమాద బాధితుల్లో దాదాపు పది శాతం మందికి తలకు గాయాలవుతున్నాయి.ఈ ప్రమాదాలను నియంత్రించేందుకు మార్గాలు, పద్ధతులపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకూ ఏటా ట్రామా డే నిర్వహిస్తున్నాం. - **డాక్టర్ వీఎస్ఎన్ మూర్తి**, ఎమర్జెన్సీ మెడిసిన్ డిపార్ట్‌మెంట్ విభాగాధిపతి

హెచ్‌పీసీఎల్‌లో కాంట్రాక్టు కార్మికుల మెరుపు సమ్మె

మల్కాపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): హెచ్‌పీసీఎల్‌లో విస్తరణ పనులు చేపడుతున్న వందలాది కాంట్రాక్టు కార్మికులు బుధవారం మధ్యాహ్నం మెరుపు సమ్మెకు దిగారు. ఒక్కసారిగా పనిచేస్తున్న ప్రదేశాల్లోనే పనిముట్లను విడిచిపెట్టి (టూల్స్‌డౌన్) నిరసన తెలిపారు. యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హెచ్‌పీసీఎల్‌లో విస్తరణ పనులను ఎల్అండ్‌టీ సంస్థ కాంట్రాక్టుకు తీసుకుని, కొన్నింటిని ఎంఎంహెచ్ అనే సంస్థకు సబ్ కాంట్రాక్టుకు ఇచ్చింది. ఈ కాంట్రాక్టర్ వద్ద అనేకమంది పనిచేస్తున్నారు. అయితే ఈ కాంట్రాక్టర్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వకపోగా ఫైనల్ సెటిల్‌మెంట్‌కు మెండికేస్తున్నారు. దీనిపై నిలదీస్తే కార్మికుల పట్ల దురుసుగా వ్యవహరించడంతో పాటు విధుల నుంచి తొలగించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఆగస్టు నుంచి జీతాలు ఇవ్వడం లేదని, హెచ్‌పీసీఎల్ యజమాన్యంతో పాటు లేబర్ కమిషనర్ చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

శరీర అవయవదాతల సంఘం కార్యదర్శిగా వినోద్ బాలు

విశాఖపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): శరీర అవయవదాతల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సంఘ సేవకుడు, రక్తదాన ఉద్యమకర్త వినోద్‌బాలు నియమితులయ్యారు. ఈ మేరకు సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్, ఆలిండియా బాడీ అండ్ ఆర్గాన్ డోనర్స్ అసోసియేషన్ చైర్మన్ గూడూరు సీతామహాలక్ష్మి బుధవారం నియామకపత్రాన్ని అందించారు. వేయికిపైగా రక్తదాన శిబిరాలు నిర్వహించి, 54 వేల యూనిట్ల రక్తాన్ని సేకరించిన వినోద్ బాలును ప్రధాన కార్యదర్శిగా నియమించడం ఆనందంగా ఉందన్నారు. అవయవదానం పట్ల మరింత అవగాహన కల్పిస్తానన్నారు.



నియామకం పత్రం అందుకుంటున్న బాలు

18 నుంచి ఏయూలో సదస్సు

విశాఖపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కాలేజీలో ఈ నెల 18, 19 తేదీల్లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్), డేటా సైన్స్ (డీఎస్)పై తెలుగులో చర్చా వేదిక నిర్వహిస్తున్నట్టు సదస్సు సహ సమన్వయకర్త ప్రొఫెసర్ ఎం.రాంజీ ఒక ప్రకటనలో తెలిపారు. వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో ఈ చర్చా వేదికలో నిపుణుల ప్రసంగాలు, పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు ఉంటాయన్నారు. విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్, బోధన సిబ్బంది, పరిశ్రమల నిపుణులు పాల్గొనవచ్చన్నారు.

జీతాల కోసం సినర్జీస్ కార్మికుల ఆందోళన



సినర్జీస్ కంపెనీ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

కూర్మన్నపాలెం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గత ఆరు నెలలుగా జీతాలు చెల్లించకుండా సినర్జీస్ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం కార్మికులు ఆందోళనకు దిగారు. జీతాలు అడిగితే పని నుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నారని సిటూ నేత ఎం.రాంబాబు ఆరోపించారు. పరిశ్రమలో పని చేస్తున్న సుమారు 950 మంది కార్మికులకు 20 ఏళ్లుగా ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని, జీతాలు సకాలంలో అందక ఆర్థిక ఇబ్బందులకు తాళలేక ఆందోళనకు దిగామన్నారు. బీ-షిఫ్ట్‌కు వచ్చిన కార్మికులు కర్మాగారం గేటు వద్ద అందోళనకు దిగడంతో ఏ-షిఫ్ట్ కార్మికులు లోపలే ఉండిపోయారు. సమస్య పరిష్కారమయ్యే వరకు ఆందోళనను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. దత్తాత్రేయ, నాయుడు, శ్రీను, కార్మికులు పాల్గొన్నారు.

మాస్టర్‌ప్లాన్ రహదారులు నిర్మించండి

» వీఎంఆర్‌డీఏ కమిషనర్‌కు ఎంపీ శ్రీభరత్ సూచన

విశాఖపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం, పరిసర ప్రాంతాల్లో అవసరమైన మాస్టర్‌ప్లాన్ రహదారులను గుర్తించి, తక్షణమే పనులు చేపట్టాలని వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్‌ను ఎంపీ శ్రీభరత్ కోరారు. వీఎంఆర్‌డీఏ కార్యాలయానికి వెళ్లి అధికారులతో ఆయన బుధవారం సమావేశమయ్యారు. విశాఖ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ఎటువంటి ప్రణాళికలు రూపొందించారనే అంశాలను తెలుసుకున్నారు. ప్రధాన రహదారులకు అంతర్గత రహదారులను అనుసంధానం చేయాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న మౌలిక వసతుల పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కమిషనర్, కార్యదర్శి కె.రమేశ్, చీఫ్ ఇంజనీర్ భవానీ శంకర్, ఎస్ఈ బలరామరాజు, సీయూపీ శిల్ప పాల్గొన్నారు.



వీఎంఆర్‌డీఏ కమిషనర్, అధికారులతో చర్చిస్తున్న ఎంపీ శ్రీభరత్

న్యూరో సమస్యలకు అధునాతన వైద్యం

ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు

నేషనల్ న్యూరాలజీ కాన్ఫరెన్స్ ఐఏఎన్‌సీవోఎన్ ప్రారంభం

విశాఖపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నాడీ సంబంధిత సమస్యలను అధునాతన వైద్య విధానాలను అనుసరించడం ద్వారా పరిష్కరించవచ్చునని ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు పేర్కొన్నారు. నేషనల్ న్యూరాలజీ కాన్ఫరెన్స్ ఐఏఎన్‌సీవోఎన్-2024 బుధవారం నోవాటెల్ హోటల్‌లో ప్రారంభమైంది. ఐదు రోజులపాటు జరగనున్న ఈ సదస్సులో అనేక అంశాలను చర్చించనున్నారు. తొలిరోజు సదస్సును మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ జి.బుచ్చిరాజుతోపాటు అసోసియేషన్‌కు చెందిన వైద్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ బుచ్చిరాజు మాట్లాడుతూ నాడీ సంబంధిత రుగ్మతలను డాప్లర్ పరిజ్ఞానం ద్వారా నయం చేయవచ్చునన్నారు. బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన రోగికి నాలుగు, ఐదు గంటలలోగా ఇంజెక్షన్ ఇవ్వడం ద్వారా మరణం నుంచి కాపాడేందుకు అవకాశం ఉందన్నారు. నరాలు, కండరాలు, నాడీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న రోగులను అంచనా వేయడం కష్టంతో కూడుకున్న పనిగా పేర్కొన్నారు. అంతకుముందు ఉదయం నుంచి సాయంత్రం వరకు నాలుగు హాల్స్‌లో వివిధ అంశాలపై ప్రత్యేక సెషన్స్ నిర్వహించారు. సదస్సులో ఇండియన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ అఖిల భారత అధ్యక్షుడు డాక్టర్ దేబశిష్ చౌదరి మాట్లాడుతూ న్యూరాలజీ సంబంధిత సమస్యల్లో మెరుగైన వైద్య సేవలు అందించడంలో సమయం కీలకంగా ఉంటుందన్నారు. సకాలంలో ఆస్పత్రిలో చేర్పించాల్సి ఉంటుందన్నారు. సదస్సులో ప్రముఖ వైద్యులు డాక్టర్ మీనాక్షి సుందరం, డాక్టర్ ఎం.మధుసూదన్‌బాబు, సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎస్.గోపీ, డాక్టర్ సతీష్, డాక్టర్ కిషోర్‌బాబు, డాక్టర్ సుష్మ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న వైద్యులు

నేవీ అధికారుల సాహస యాత్ర



జెండా ఊపి మోటార్‌సైకిల్ యాత్రను ప్రారంభిస్తున్న దృశ్యం

విశాఖపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రాష్ట్రాల్లో సముద్ర కార్యకలాపాలపై అవగాహన పెంచేందుకు తూర్పు నౌకాదళం ఈశాన్య మోటార్ సైకిల్ సాహసయాత్రను విశాఖలో బుధవారం ప్రారంభించింది. గత ఏడాది కూడా లడఖ్ తదితర ప్రాంతాల్లో ఈ కార్యక్రమం నిర్వహించినట్టు నేవీ వర్గాలు తెలిపాయి. ఈసారి మేఘాలయ అస్సాం, అరుణాచల్ ప్రదేశ్‌ల్లో పాఠశాలలు, కాలేజీలకు వెళ్లి భారత నౌకాదళంలో ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పిస్తామన్నాయి. అధికారులు, నావికులతో కూడిన 40 మంది సభ్యులు మోటార్‌సైకిళ్లపై 15 రోజుల యాత్రకు వెళ్లారు.2,500 కి.మీ. దూరం ప్రయాణించి అవగాహన కల్పిస్తారు.

నేవీలో 'అగమ్య' కేంద్రం ప్రారంభం

తూర్పు నౌకాదళంలోని విశ్వకర్మ యూనిట్‌లో షిప్ ఫైర్ ఫైటింగ్ శిక్షణ కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. నౌకల్లో అగ్నిప్రమాదలు జరిగినపుడు ఏమి చేయాలనే అంశాలపై ఇందులో శిక్షణ ఇస్తారు. దీనిని చీఫ్ ఆఫ్ స్టాఫ్ వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా ప్రారంభించారు. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా దీనిని ఏర్పాటు చేశారు.

అందరినీ ఆకట్టుకునేలా పొట్టేల్ చిత్రం

» నగరంలో సందడి చేసిన చిత్ర యూనిట్



సమావేశంలో మాట్లాడుతున్న హీరోయిన్ అనన్య

రాంనగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25న విడుదల కానున్న పొట్టేల్ చిత్రాన్ని విజయవంతం చేయాలని చిత్ర హీరోయిన్ అనన్య నాగళ్ళ కోరారు, నిశాంక్ రెడ్డి నిర్మాతగా మోతుకూరి సాహిత్ దర్శకత్వంలో యువన్‌కృష్ణ, అనన్య హీరో హీరోయిన్లుగా రూపొందిన 'పొట్టేల్' యూనిట్ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా బస్సు యాత్ర నిర్వహిస్తోంది. బుధవారం విశాఖ విచ్చేసిన బృందం విలేకరులతో మాట్లాడారు. ఈ చిత్రం తెలంగాణ నేపథ్యంలో సాగుతుందన్నారు. కచ్చితంగా ప్రేక్షకులకు ఆకట్టుకుంటుందన్నారు. హీరో యువన్ కృష్ణ మాట్లాడుతూ ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, పాటలకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. సీనియర్ నటుడు అజయ్ పాత్ర ప్రేక్షకులను కట్టి పడేస్తుందన్నారు. దర్శకుడు సాహిత్ చిత్రాన్ని అద్భుతంగా తీశారని, అన్నివర్గాల ప్రజలను ఆకట్టుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ చిత్రాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నటుడు నోయల్, నిశాంక్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలతో యువతను అనుసంధానం చేయాలి

ఏపీ డిజాస్టర్ రెస్పాన్స్, ఫైర్ సర్వీసెస్ డీజీ మాదిరెడ్డి ప్రతాప్

విశాఖపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలతో యువతను అనుసంధానం చేస్తూ వారిలో ఉపాధి నైపుణ్యాలను పెంచే దిశగా కృషిచేయాలని ఏపీ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీసెస్ విభాగం డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్ పేర్కొన్నారు. బుధవారం ఏయూను సందర్శించిన ఆయన వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావుతో సమావేశమయ్యారు. కాలానుగుణంగా ఉపాధిని సృష్టించే నూతన కోర్సులను రూపిందించాలన్నారు.ఇండస్ట్రీ పార్టనర్‌షిప్‌ను పెంపొందిస్తూ నైపుణ్యాలను మెరుగుపరచాలన్నారు. ఏయూలో డ్రోన్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని సూచించారు. వీఎల్ఎస్ఐ కోర్సును ప్రారంభిస్తున్నట్టు వీసీ తెలిపారు. ప్రతి విద్యార్థికీ ఉపాధి కల్పన దిశగా పనిచేస్తున్నామన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ధనుంజయరావు మాట్లాడుతూ వర్సిటీలో 64 దేశాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎన్.కిశోర్‌బాబు, సురేష్ బేత తదితరులు పాల్గొన్నారు. అనంతరం డైరెక్టర్ జనరల్‌ను సత్కరించి జ్ఞాపికను బహూకరించారు.



మాదిరెడ్డి ప్రతాప్‌ను సత్కరిస్తున్న ఏయూ వీసీ, రిజిస్ట్రార్

క్రైం... crime news

గల్లంతైన స్వాతిక్ మృతదేహం లభ్యం



స్వాతిక్ (ఫైల్‌ఫొటో)

అగనంపూడి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రంలోని కునకుంద నదిలో గల్లంతైన అగనంపూడికి చెందిన కంచిపాటి స్వాతిక్ (18) మృతదేహం ఎట్టకేలకు లభ్యమైంది. ఉక్కు నిర్వాసిత కాలనీ కొండయ్యవలసకు చెందిన కంచిపాటి నరసింహమూర్తి కుమారుడైన స్వాతిక్ దసరా సెలవులకు ఒడిశా రాష్ట్రంలోని సుందర్‌ఘర్‌లో ఉంటున్న తన మేనమామ ఇంటికి వెళ్లాడు. ఈ నెల 13న కొంతమందితో కలిసి కునకుంద నదిలో స్నానానికి దిగి గల్లంతయ్యాడు. అక్కడి పోలీసులు గత ఈతగాళ్ల సాయంతో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టగా మూడు రోజులకు మృతదేహం లభ్యమైంది. సాత్విక్ మృతదేహాన్ని బుధవారం అగనంపూడికి తీసుకురావడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. కాగా స్వాతిక్ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు.

తండ్రిని హత్య చేసిన నిందితుడి అరెస్టు

గోపాలపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో తండ్రిని హత్య చేసిన వ్యక్తిని పెందుర్తి పోలీసులు అరెస్టు చేశారు. గ్రేటర్ పరిధి 88వ వార్డు నరవ గ్రామంలోని మన్నెపాలెం కాలనీలో ఎంగిలి దేముడు(60)ను మద్యం మత్తులో అతని కుమారుడు కిరాతకంగా గొంతుకోసి హత్య చేసిన సంగతి తెలిసిందే. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పెందుర్తి సీఐ సతీశ్‌కుమార్ నిందితుడి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. పెందుర్తి రైల్వేస్టేషన్ దగ్గర సంచరిస్తున్న గోపిని బుధవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నిందితుడ్ని రిమాండ్‌కు తరలించారు.

జాతీయ పారా స్విమ్మింగ్ టోర్నీకి రాష్ట్ర జట్టు




ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న గిరీషా, రామస్వామి తదితరులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ పారా స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ టోర్నీలో ఆంధ్రప్రదేశ్ జట్టు నుంచి 26 మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్టు పారా స్పోర్ట్సు అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి వి.రామస్వామి తెలిపారు. ఈ నెల 19 నుంచి గోవాలో జరగనున్న జాతీయ పారా స్విమ్మింగ్ టోర్నీలో పాల్గొంటున్న క్రీడాకారులను స్పోర్ట్సు అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పీఎస్ గిరీషా బుధవారం తన కార్యాలయం వద్ద అభినందించి రాష్ట్రానికి పతకాలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పారా స్పోర్ట్సు అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు గోనుగుంట్ల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

జట్టు సభ్యులు: పురుషుల విభాగంలో అన్నపురెడ్డి లక్ష్మణరావు, బొమ్మన బోయిన రమేష్, ఎన్.నూకరాజు, దేవేంద్ర గంటా, కనుమూరి సిద్దార్థ వర్మ, బి.రవికుమార్, మూర్తి నవీన్‌బాబు, సుంకరి దినేష్, వెనిశెట్టి దేవన్‌శ్రీ చంద్రేష్, పొట్నూరు ప్రేమ్‌చంద్, పి.చైతన్యరెడ్డి, వలసనైని రవి, నాగదుర్గ మార్కండేయ కుమార్, కట్టా లావయ్య, ఆర్వీపీ భవానీ కార్తీక్, నాగుల సురేష్, పి.చరిత్, ఆడారి ప్రణీత్, షేక్ కౌషర్ సాహిల్, బోయిన మోహిత్, బలగ గణేష్, మండ సాయి నిఖిల్ గౌతమ్, గొలగాని జితేంద్ర; మహిళల విభాగంలో ఆర్.సంజన, రింపీ బిస్‌జై, బి.నిధి ప్రాతినిధ్యం వహించనున్నారు.

59.6 అడుగులకు చేరిన మేహాద్రిగెడ్డ నీటిమట్టం

» ఇన్‌ఫ్లో పెరిగితే గేట్లు ఎత్తే అవకాశం



నిండుకుండలా మేహాద్రిగెడ్డ రిజర్వాయర్

గోపాలపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రెండు నెలలుగా కురుస్తున్న వర్షాలకు మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నిండుకుండను తలపిస్తోంది. రిజర్వాయర్ గరిష్ఠ నీటి మట్టం 61 అడుగులు కాగా గత నెలలోనే ఒక్కసారిగా సుమారు పది అడుగులు పెరిగి గరిష్ఠ నీటి మట్టాన్ని సమీపించింది. దీంతో గత నెలలో నాలుగుసార్లు గేట్లు ఎత్తి వరదనీటిని విడుదల చేశారు. దిగువ ప్రాంతాలకు ముంపు భయం ఉండడంతో రిజర్వాయర్ నీటిమట్టం 60 అడుగులు సమీపించగానే వరదనీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతంలో ఉన్న చెరువులు నిండిపోవడంతో ఓ మోస్తరు వర్షం కురిసినా వరదనీరు చేరుతోంది. ఈ క్రమంలో సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ నీటిమట్టం 60 అడుగులకు చేరకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం రిజర్వాయర్ నీటిమట్టం 59.6 అడుగులకు చేరింది. ఇన్‌ఫ్లో పెరిగితే గేటు ఎత్తే అవకాశం ఉందని సిబ్బంది తెలిపారు.